E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 24-02-2026 (వారం) మంగళవారం సంపుటి: 02 || సంచిక:54||






ఈపీఎఫ్ఓ కీలక నిర్ణయం..

అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు ఆటో రిఫండ్

....(4లో)




హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో

## చిరు జల్లులు

- నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావం వల్ల వర్షా లు
- మధ్యాహ్నం వరకు ఎండ... ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం
- ఖైరతాబాద్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్ తదితర ప్రాంతాల్లో వర్షం–ఖైరతాబాద్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్ తదితర ప్రాంతాల్లో వర్షం చేయాలని సూచన




తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతం

## ..పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం

- పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వెల్లడి
- ఈ నెల 26 నుంచి 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమం
- జిల్లాలు, లోక్ సభ సభ్యుల వారీగా ఇన్‌ఛార్జుల నియామకం

ఈ కబురు, హైదరాబాద్ ;

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణలో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు




## ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

ఈ కబురు, హైదరాబాద్:

ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 60 ఏళ్లలోపు ఉద్యోగి చనిపోతే రెగ్యులర్ బెనిఫిట్లతో పాటు అదనంగా రూ.10 లక్షలు వచ్చేలా చర్యలు చేపట్టినట్లు ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం పలు అంశాలపై చర్చించింది.

నా పేరుతో ఎలాంటి సంస్థల ఏర్పాటుకు

## అనుమతి లేదు

- తన పేరుతో సంస్థల ఏర్పాటుపై స్పందించిన కేటీఆర్
- కేటీఆర్ సేవా సమితి, కేటీఆర్ సేవ పేరుతో కార్యకలాపాలు
- తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకు అనుమతి లేదని స్పష్టీకరణ
- ఎవరైనా పని చేయాలనుకుంటే బీఆర్ఎస్ పార్టీలో కలిసి పని చేయాలని సూచన



ఈ కబురు ;

తన పేరుతో కొంతమంది సంస్థలను ఏర్పాటు చేసినట్లు వచ్చిన వార్తలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు.

....(మిగతా2లో)



మార్చి 20న

# తెలంగాణ బడ్జెట్

మార్చి 16 నుంచి 30 వరకు అసెంబ్లీ సమావేశాలు

ఈ కబురు, హైదరాబాద్:

తెలంగాణ బడ్జెట్ సమావేశాల ముహూర్తం ఖరారు అయ్యింది. 2026, మార్చి 16 నుంచి 30వ తేదీ వరకు బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. మార్చి 16న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. మార్చి 20న అసెంబ్లీలో ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టనుంది.

సోమవారం (ఫిబ్రవరి 23) సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ భేటీ జరిగింది. ఈ భేటీలో బడ్జెట్ సమావేశాల నిర్వహణపై మంత్రి మండలి సుదీర్ఘంగా చర్చించింది. అనంతరం 2026, మార్చి 16 నుంచి 30వ తేదీ వరకు బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని మంత్రి మండలి సూత్రప్రాయంగా నిర్ణయించింది.

**కేబినెట్ భేటీ నిర్ణయాలు**

తెలంగాణ వైద్య విధాన పరిషత్ పేరును డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మారుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దీంతో తెలంగాణ వైద్య విధాన పరిషత్ (TVVP) ఉద్యోగులు ఇకపై ప్రభుత్వ పరిధిలోకి రానున్నారు. అలాగే..

....(మిగతా2లో)

ఆ తీర్పును అలుసుగా తీసుకుని ఆటలాడితే

## భారీ టారిఫ్‌లు



ఈ కబురు : సుంకాల విషయంలో అమెరికా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అలుసుగా తీసుకుని ఏ దేశమైనా ఆటలాడాలని చూస్తే భారీ టారిఫ్‌లు విధిస్తానని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. తీర్పు విషయంలో సుప్రీం కోర్టును మరోసారి లక్ష్యంగా చేసుకున్నారు. తెలియకుండానే తనకు మరిన్ని అధికారాలు కట్టబెట్టిందని పేర్కొన్నారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో వరుస పోస్టులు పెట్టారు. "సుప్రీంకోర్టు తీర్పును అలుసుగా తీసుకుని ఆటలాడాలని చూసే దేశాలపై ఎన్నడూలేని రీతిలో సుంకాలు విధిస్తా.

....(మిగతా2లో)

హోర్డింగ్ యజమానుల..

## అభ్యంతరాలను వినాలి

తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



ఈ కబురు, హైదరాబాద్ ;

తెలంగాణా హైకోర్ట్ W.P. No. 5442 of 2026 కేసులో 20.02.2026 తేదీన ఇచ్చిన ఆదేశాల మేరకు, ప్రతిపాదిత నూతన అవుట్‌డోర్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీపై సంబంధిత స్టేక్‌హోల్డర్ల అభిప్రాయాలు,

....(మిగతా2లో)

నేను తప్పు చేసినట్లు నిరూపిస్తే

## రాజకీయాలు వదిలేస్తా

ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు : వెంకటరమణారెడ్డి

ఈ కబురు, హైదరాబాద్ :

కామారెడ్డి లో కాంగ్రెస్ బిజెపి నేతల మధ్య వివాదం ముదిరింది. కాంగ్రెస్ నేతలు, బిజెపి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి కామారెడ్డిలో



....(మిగతా2లో)

## హైదరాబాద్ మెట్రో రైలుపై

తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం

- హైదరాబాద్ మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని నిర్ణయం
- ఎల్ అండ్ టీతో సూత్రప్రాయంగా గత ఏడాది ఒప్పందం
- రూ.13 వేల కోట్ల రుణాలను బదలాయించుకోనున్న ప్రభుత్వం

ఈ కబురు, హైదరాబాద్ ;


హైదరాబాద్ మెట్రో రైలుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది.

....(మిగతా2లో)



8 నెలల ఆపరేషన్..

## 'ఇజ్రాయెల్ గ్రూప్' ఆటకట్టు



ఈ కబురు : జమ్మూకశ్మీర్‌లోని కిశ్త్‌వార్‌లో ఆదివారం నాటి ఎన్‌కౌంటర్‌లో సైపుల్లా సహా ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. దీంతో స్థానికంగా ఏడాదిన్నర కాలంగా సాగుతున్న సుదీర్ఘ ఆపరేషన్‌కు తెరపడిందని జమ్మూ జోన్ ఐజీ భీమ్‌సేన్ వెల్లడించారు. ఇందులో భాగంగా మొత్తం ఏడుగురు జైషే మహమ్మద్ ఉగ్రవాదులతో కూడిన మాడ్యూల్‌ను నిర్మూలించామని తెలిపారు. "

....(2లో)

పనితీరు ఆధారంగా

# ఉద్యోగులకు వెయిటేజ్

- చక్కటి పనితీరు కనబర్చే ఉద్యోగులకు ఇకపై ప్రభుత్వం నుంచి అభినందన లేఖలు
- తాగునీటి శాంపిళ్ల పరీక్షలకు మొబైల్ ల్యాబులను అందుబాటులోకి తేవాలి
- ఆస్పత్రుల్లో డాక్టర్ల కొరత ఉండకుండా చర్యలు తీసుకోవాలి
- రెవెన్యూ శాఖకు ఫ్రెష్ లుక్ తీసుకురావాల్సిన అసరం ఉంది
- టెక్నాలజీతో ప్రభుత్వం అందించే సేవలపై అవగాహనకు ప్రత్యేక కార్యాచరణ
- ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షలో సీఎం చంద్రబాబు



ఈ కబురు,అమరావతి :

ప్రజలకు మెరుగైన సేవలు అందించడం.. ప్రభుత్వ సేవలను సులభతరం చేయడమే లక్ష్యంగా ఉద్యోగులు, అధికారులంతా పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివిధ శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఉద్యోగుల పనితీరును మదింపు చేస్తున్న క్రమంలో పనితీరు సరిగా లేని వారిని మోటివేట్ చేయడంతోపాటు... బాగా పని చేస్తున్న వారిని గుర్తించి.. వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు సూచించారు. క్షేత్ర స్థాయిలో చక్కగా పని చేస్తూ... ప్రజల మెప్పు పొందిన ఉద్యోగులను గుర్తించి ప్రోత్సహిస్తే బాగుంటుందంటూ సీఎం చేసిన సీఎం సూచనపై పలువురు అధికారులు బాగుంటుందని అభిప్రాయపడ్డారు. బాగా పని చేసే ఉద్యోగులకు ఈ తరహా అభినందించడం ఇదే తొలిసారి అవుతుందని చెప్పారు. ఈ రకమైన విధానం వల్ల ఉద్యోగుల్లో పోటీతత్వం పెరుగుతుందని ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు.

....(మిగతా2లో)

## నో'టమాట రావట్లే



- కొత్తగూడ మండల కేంద్రంలో ఉచితంగా టమాటాలు పంపిణీ చేస్తున్న రైతు
- కిలో రూ. 5కు పడిపోయిన టమాటా ధర
- నుకూలించిన వాతావరణం, పెరిగిన దిగుబడి
- నిల్వచేసే అవకాశం లేకపోవడంతో తక్కువ ధరకు అమ్మకాలు
- రవాణా ఖర్చులు కూడా రావడం లేదంటున్న రైతులు

....(2లో)

గచ్చిబౌలిలో చదరపు గజం రూ.1.76 లక్షలు



....(2లో)

బాల్క సుమన్ బెయిల్, కస్టడీ పిటిషన్లపై

## విచారణ వాయిదా

ఈ కబురు, మందమర్రి :

మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జరిగిన ఘటనల్లో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌పై ఆదిలాబాద్ జైలుకు తరలించిన సంగతి తెలిసిందే.



....(మిగతా3లో)

# మార్చి 20న తెలంగాణ బడ్జెట్



దీంతో తెలంగాణ వైద్య విధాన పరిషత్(TVVP) ఉద్యోగులు ఇకపై ప్రభుత్వ పరిధిలోకి రానున్నారు. అలాగే.. హైదరాబాద్ మెట్రోను L&T నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని కూడా మంత్రివర్గం నిర్ణయించింది. మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరులో JNTU కాలేజీ నిర్మాణానికి 70 ఎకరాలను కేటాయించింది. ఖమ్మంలో టీటీడీకి 20 ఎకరాల భూమి కేటాయింపుకు ఆమోదం తెలిపింది. జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ ఆఫీసులకు భూ కేటాయింపులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## నా పేరుతో ఎలాంటి సంస్థల ఏర్పాటుకు
# అనుమతి లేదు



తెలంగాణలో 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన' పేరుతో కొన్ని సంస్థలు కార్యకలాపాలు చేపడుతుండటంపై ఆయన స్పందించారు. తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకు అనుమతి లేదని వెల్లడించారు. అలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించేది లేదని స్పష్టం చేశారు. తన పేరుతో కార్యకలాపాలు నిర్వహించే సంస్థలకు ఎలాంటి గుర్తింపు, అనుమతి లేదనే విషయం అందరూ గుర్తించాలని అన్నారు. ఎవరైనా పనిచేయాలనుకుంటే కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ పరిధిలోనే చేయాలని కేటీఆర్ స్పష్టం చేశారు. తన పేరుతో పలు సంస్థల ద్వారా చేస్తున్న కార్యక్రమాలను నిలిపివేయాలని, తనపై అభిమానం ఉన్నవాళ్లు బీఆర్ఎస్ పార్టీతో కలిసి పనిచేయాలని సూచించారు.

## ఆ తీర్పును అలుసుగా తీసుకుని ఆటలాడితే
# భారీ టారిఫ్‌లు



అమెరికాను దశాబ్దాలుగా కొల్లగొట్టిన దేశాలు.. ఇటీవల అంగీకరించిన దానికంటే భారీ సుంకాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. జాగ్రత్త! సుంకాల ఆమోదం పొందడానికి అధ్యక్షుడిగా నేను కాంగ్రెస్‌కు తిరిగి వెళ్లాల్సిన అవసరం లేదు'' అంటూ ట్రంప్ హెచ్చరించారు. ''అనేక ఏళ్లుగా అమెరికాను కొల్లగొట్టిన దేశాలపై ఇప్పుడు లైసెన్స్‌ల రూపంలో కఠిన చర్యలు తీసుకోవచ్చు. అయితే.. ఈ లైసెన్స్‌లకు ఫీజు వసూలు చేయడం కుదరదని తీర్పు చెబుతోంది. వాస్తవానికి ప్రతి లైసెన్స్‌కు ఒక ఫీజు ఉంటుంది. మరి మేం ఎందుకు వసూలు చేయకూడదు? అదేవిధంగా కోర్టు ఇతర సుంకాలను ఆమోదించింది. ఇప్పుడు వాటిని చట్టబద్ధంగా, కఠినమైన రీతిలో ఉపయోగించగలను. ఏదేమైనా.. కోర్టు తప్పుడు వ్యక్తులకు సాయం చేసింది. మున్ముందు 'జన్మతః పౌరసత్వం' విషయంలోనూ వ్యతిరేక తీర్పు ఇవ్వొచ్చేమో! ఇలాంటి తీర్పులు చైనా, ఇతర దేశాలకే ప్రయోజనాలు చేకూరుస్తాయి'' అని మండిపడ్డారు. 'అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టం' (ఐఈఈపీఏ)ను ఉపయోగించి ప్రపంచ దేశాలపై ట్రంప్ ఏకపక్షంగా టారిఫ్‌లు విధించడాన్ని అమెరికా సుప్రీం కోర్టు ఇటీవల తీవ్రంగా తప్పుబట్టిన సంగతి తెలిసిందే. అమెరికా కాంగ్రెస్ అనుమతి లేకుండా వేసిన ఈ సుంకాలు చెల్లవంటూ తీర్పు వెలువరించింది.

## హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో
# చిరు జల్లులు

**ఈ కబురు,హైదరాబాద్ ;**

హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. ఇప్పుడిప్పుడే ఎండలు ముదురుతున్నాయి. ఇలాంటి తరుణంలో హైదరాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావం వల్ల వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, కాచిగూడ, కొండాపూర్, ఎల్బీనగర్, కూకట్‌పల్లి, ఉప్పల్, మాసాబ్ ట్యాంకు తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ కాసింది. ఆ తర్వాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. కాగా, నిజామాబాద్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోనూ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, నిజామాబాద్, సిరిసిల్ల, జగిత్యాల, మెదక్, సిద్దిపేట, వికారాబాద్, కామారెడ్డి, మంచిర్యాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

## పనితీరు ఆధారంగా
# ఉద్యోగులకు వెయిటేజ్



బాగా పని చేస్తున్న ఉద్యోగులను గుర్తించడంతో పాటు వారికి అభినందన లేఖలు పంపాలని సీఎం ఆదేశించారు. ఓ వైపు పని తీరు మదింపు చేస్తూనే.. మరోవైపు ప్రతి నెల బాగా పని చేస్తున్న ఉద్యోగులకు అభినందన లేఖ పంపాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయా శాఖల ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సీఎం చెప్పారు. బాగా పని చేస్తున్న ఉద్యోగులకు అప్రిసియేషన్ లెటర్లు ఇవ్వడమే కాకుండా... వారి వ్యక్తిగత రికార్డుల్లో కూడా వీటిని నమోదు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. బాగా పని చేస్తున్న వారిని ప్రోత్సహిస్తూనే... పనితీరు సరిగా లేని వారిని మోటివేట్ చేసేలా చర్యలు తీసుకునే అంశంపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఇక పనితీరు ఆధారంగా ఉద్యోగులకు వెయిటేజ్ ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

**వైద్యాలయాలు బాగుండాలి... దేవాలయాల్లో సౌకర్యాలు మెరుగవ్వాలి...**

వివిధ శాఖలపై సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."పీహెచ్సీల నుంచి మొదలుకుని అన్ని స్థాయిల్లోని ఆస్పత్రుల్లో పారిశుధ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ఎవరైనా పారిశుధ్యాన్ని సరిగా నిర్వహించకుంటే.. సదురు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలను బాధ్యులుగా చేయాలి. పారిశుధ్యం విషయంలో ఎన్నిసార్లు చెప్పినా పద్ధతి మార్చుకోని ఆస్పత్రుల జాబితాను సిద్ధం చేయండి. ఆస్పత్రుల్లో పారిశుధ్యం, మెడికల్ ఎక్విప్మెంట్ అందుబాటులో ఉందా...? లేదా..? అనే అంశంపై ఆయా ఆస్పత్రులకు చెందిన అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లను బాధ్యులుగా చేయాలి. ఇక ప్రతి ఆస్పత్రిలో డాక్టర్ల కొరత రాకుండా చూసుకోవాలి. ఎక్కడైనా వైద్యుల కొరత ఉంటే.. డాక్టర్లను నియమించుకునేలా చర్యలు తీసుకోండి. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు ఆయా జిల్లాల్లోని కలెక్టర్లతో సంప్రదింపులు జరపాలి. గతంతో పోల్చుకుంటే దేవాలయాల్లో సిబ్బంది పనితీరు కొంత మెరుగైనా.. మరింత ఇంప్రూవ్ చేసుకోవాల్సిన అవసరం ఉంది. భక్తులకు సౌకర్యాలు అందించడంతోపాటు... ఆధ్యాత్మిక వాతావరణం ఉండేలా చూసుకోవాల్సిన అంశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయొద్దు" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**రెవెన్యూ శాఖను దారిలోకి తేవాలి...**

"ప్రజలకు సౌకర్యాలు కల్పించడంతోపాటు జీరో కరెప్షన్ ఉండేలా చూడాలి. ఏసీబీని యాక్టివేట్ చేసే పరిస్థితి రాకూడదు. సరిగా పని చేయని తహసీల్దార్లను పక్కన పెట్టే పరిస్థితి తెచ్చుకోవద్దు. బాగా పని చేసే డిప్యూటీ తహసిల్దార్లను గుర్తిస్తున్నాం. రెవెన్యూ శాఖకు ఫ్రెష్ లుక్ తీసుకురావాల్సిన అవసరం కన్పిస్తోంది. రెవెన్యూ శాఖకు ఉన్న చెడ్డపేరు పోవాలి. గతంతో పోల్చుకుంటే మార్పు కన్పించాలి. రీసర్వేతో అన్ని భూ సంబంధిత సమస్యలు పోవాలి. మళ్లీ వివాదాలు రాకుండా చూడాలి. రెవెన్యూ సేవలను.. మరీ ముఖ్యంగా భూ సంబంధిత సర్వీసులను ఆటోమోషన్లో పెట్టే దిశగా చర్యలు తీసుకుంటాం. ఎవరైనా సర్వేయర్లు సరిగా వ్యవహరించకుంటే.. కఠినమైన చర్యలు తీసుకుంటాం. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకూడదు. తాగునీరు కలుషితం కాకూడదు. ఎప్పటికప్పుడు తాగునీటి నమూనాలను సేకరించాలి. వాటిని ల్యాబులకు పంపి పరీక్షించాలి. ల్యాబులు అందుబాటులో లేకుంటే మొబైల్ ల్యాబులు పెట్టే దిశగా చర్యలు తీసుకోవాలి. రోడ్ ప్రమాదాలను ఆడిట్ చేయించాలి. ఆడిట్ నివేదికల ఆధారంగా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి"అని ముఖ్యమంత్రి చెప్పారు.

**టెక్నాలజీతో అందించే సేవలపై ప్రజలకు అవగాహన**

"ప్రభుత్వం పెద్ద ఎత్తున టెక్నాలజీని వినియోగించి సేవలు అందిస్తోంది. అలాగే పరిపాలనలోనూ టెక్నాలజీని అడాప్ట్ చేసుకుంటోంది. ప్రభుత్వం టెక్నాలజీ ద్వారా అందించే సేవలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. దీని కోసం మీ సేవ, డ్వాక్రా సంఘాలు, ప్రణాళిక విభాగం వంటి వాటితో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. ఆన్ లైన్లో, ఆఫ్ లైన్లో టెక్నాలజీ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఇక ఇటీవల ఢిల్లీలో ఏఐఇంపాక్ట్ సదస్సుకు హాజరయ్యాం. అక్కడ ప్రదర్శించిన టెక్నాలజీలను అధ్యయనం చేయాలి. అలాగే రాష్ట్రప్రభుత్వం చేసుకున్న ఏడు ఎంఓయూలను ఏ విధంగా అమల్లో పెట్టాలనే అంశంపై కార్యాచరణ సిద్ధం చేయాలి. ఈ మేరకు మున్సిపల్, వైద్యం, వాణిజ్య పన్నుల, ఐటీ, ఇండస్ట్రీస్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఫోకస్ పెట్టాలి."అని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షలో రెవెన్యూ, ఆర అండ్ బి, దేవదాయ, వైద్యారోగ్యం, పట్టణాభివృద్ధి, రవాణ, అగ్నిమాపక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హజరయ్యారు.

## నేను తప్పు
### చేసినట్లు నిరూపిస్తే
## రాజకీయాలు వదిలేస్తా



ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల విషయంలో వివాదం చోటు చేసుకుంది. క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరేట్ కు వెంకటరమణారెడ్డి బయలు దేరారు. డిగ్రీ కళాశాల అంశంపై కలెక్టర్ కు వినతిపత్రం ఇవ్వనున్నారు. తాము కూడా కలెక్టరేట్ కు వస్తామని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఇంటిముందు పోలీసులు బందోబస్తు ఉంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూములు కబ్జాకు గురవుతున్నాయని వెంకటరమణారెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీకి సవాల్ విసిరారు. తాను తప్పు చేసినట్లు నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తానని, డిగ్రీ కాలేజీ భూముల్లో ఒక్క గజం ఆక్రమించినా రాజీనామా చేస్తానని అన్నారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, ఎవరు రెచ్చగొడుతున్నారో పోలీసులకు తెలియదా? అని ప్రశ్నించారు. ఆర్ టిఐ కింద కాలేజీ భూముల వివరాలు అడిగానని, పూర్తి వివరాలు వచ్చాక.. అందరి సంగతి చూస్తానని కాటిపల్లి వెంకటరమణారెడ్డి సూచించారు

## హోర్డింగ్ యజమానుల..
# అభ్యంతరాలను వినాలి



అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని, అందరికీ వాదనలు వినిపించే అవకాశం కల్పించిన అనంతరం మాత్రమే తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.తెలంగాణ అవుట్ డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ తరఫున ఈ కేసును అడ్వకేట్లు వి. రూపేష్ కుమార్ రెడ్డి మరియు జి. సాయికృష్ణ వాదించారు. హోర్డింగ్ యజమానుల సమర్పించిన ప్రతినిధిత్వాలను పరిగణనలోకి తీసుకుని పాలసీని ఖరారు చేయాలని గౌరవనీయ న్యాయస్థానం రిట్ పిటిషన్‌ను పరిష్కరించింది. ఇంతకుముందు 20.04.2020 తేదీన జారీ చేసిన G.O. Ms. No. 68 అనంతరం, 2,600కు పైగా రూఫ్‌టాప్ హోర్డింగ్స్/యూనిపోల్స్ తొలగించబడ్డాయి. దీనివల్ల సుమారు 209 చిన్న, మధ్యతరహా సంస్థలు మూతపడగా, ప్రింటర్లు, ఫ్యాబ్రికేటర్లు, భవన యజమానులు సహా దాదాపు ఒక లక్షమంది అనుబంధ కార్మికుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడింది. కేవలం 2-3 పెద్ద కంపెనీలకే సడలింపులు ఇచ్చినట్లు సమాచారం ఉండగా, అనేక చిన్న, మధ్య తరహా ఏజెన్సీలు సమీప మున్సిపాలిటీలకు మారాల్సి వచ్చింది. ప్రస్తుతం ఆ ప్రాంతాలు కూడా గ్రేటర్ హైదరాబద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోకి విలీనం కావడంతో మళ్లీ అదే పరిమితులు అమలవుతున్నాయి.అసోసియేషన్, పూర్వం జేఎన్టీయు సూచించిన మార్గదర్శకాల మేరకు కఠిన భద్రతా ప్రమాణాల కింద రూఫ్‌టాప్ హోర్డింగ్స్‌కు అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరింది. ఇందులో స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికేషన్, విండ్ లోడ్ అనుసరణ, నిర్దిష్ట కాల వ్యవధిలో తనిఖీలు, బీమా కవరేజ్ వంటి అంశాలు ఉన్నాయి. ఈ మేరకు వివరణాత్మక ఇంజినీరింగ్ డిజైన్లు మరియు సాంకేతిక నివేదికలు ఇప్పటికే MA & UD ప్రిన్సిపల్ సెక్రటరీ గారికి మరియు GHMC అదనపు కమిషనర్ (అడ్వర్టైజ్‌మెంట్స్) కి సమర్పించబడ్డాయి.గౌరవనీయ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో, హోర్డింగ్ యజమానుల అసోసియేషన్ సమర్పించిన అభిప్రాయాలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఎటువంటి తుది నిర్ణయం తీసుకోరాదని, సరైన వాదనలు వినిపించే అవకాశం కల్పించి, సముచితమైన కారణాలతో కూడిన ఉత్తర్వులు జారీ చేయాలని అసోసియేషన్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది.

## గచ్చిబౌలిలో చదరపు గజం రూ.1.76 లక్షలు

**ఈ కబురు, హైదరాబాద్:**

నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న హౌసింగ్ బోర్డు భూములు అధిక ధరలు పలికాయి. గచ్చిబౌలి, భౌరంపేట్, బాలాజీ నగర్, చింతల్ తదితర ప్రాంతాల్లోని మొత్తం 14 స్థలాలను బహిరంగ వేలం వేశారు. వీటిలో గచ్చిబౌలిలోని భూమి చదరపు గజం రూ.1.76 లక్షలు, కూకట్‌పల్లి బాలాజీ నగర్‌లో చదరపు గజం రూ.1.64 లక్షలు పలికింది. బహిరంగ వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.34.27 కోట్ల ఆదాయం సమకూరింది. కేపీహెచ్‌బీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఈ వేలంలో 50 మంది బిడ్డర్లు పాల్గొన్నారు.

## హైదరాబాద్
### మెట్రో రైలుపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం



మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని మంత్రివర్గం ఈరోజు నిర్ణయించింది. మెట్రో రైలు స్వాధీనంపై ఇదివరకే ప్రభుత్వం ప్రకటన చేసింది. స్వాధీనం చేసుకునే ప్రక్రియను పర్యవేక్షించడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్, జూపల్లి కృష్ణారావులతో ఈ ఉపసంఘాన్ని నియమించింది. గత సంవత్సరం సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో ఎల్ అండ్ టీకి రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా చెల్లించాలని, రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకోవాలని అవగాహనకు వచ్చాయి. నాటి నుంచి స్వాధీన ప్రక్రియ ప్రారంభమైంది.

# నో'టమాట రావట్లే



ఈ కబురు : సాధారణ పంటలు వేస్తే అప్పుల పాలవుతున్నామని భావించిన రైతులు కూరగాయల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. టమాటా వేస్తే మంచి లాభాలు వస్తాయని భావించి సాగుచేసిన రైతులకు ఈ ఏడాది చేదు అనుభవం ఎదురైంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించడం, దిగుబడి పెరగడంతో అమాంతం ధర పతనమైంది. దీంతో టమాటా పండించినా.. అప్పుల పాలయ్యామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది అక్టోబర్, నవంబర్‌లో వేసిన టమాటా తోటలకు వాతావరణం అనుకూలించింది. పెద్దగా చీడపీడలు ఆశించలేదు. రాష్ట్రంలోని వరంగల్, నిజామాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో మొత్తం 30 వేల ఎకరాల మేరకు టమాటా పంట సాగుచేశారు. ఇందుకుగాను గతం కన్నా ఎక్కువగా 2 లక్షల టన్నుల మేరకు దిగుబడి వచ్చినట్లు అంచనా.. దీనికి తోడు పక్కరాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో కూడా దిగుబడి ఎక్కువగా రావడంతో మార్కెట్ మందగించి ధర పతనమైంది.

--ధరలు పడిపోవడంతో తలపట్టుకున్న రైతులు వానాకాలం పంటకు హోల్‌సేల్‌లో కేజీ రూ. 25కు కొనేవారు. రిటైల్ ధర రూ.40 నుంచి రూ.50కి అమ్మేవారు. యాసంగి పంట రాగానే ధర పతనమైంది. 25 కిలోల పెట్టెను రూ. 100 నుంచి రూ.150కి అడుగుతున్నారు. వారాంతపు సంతల్లోకి ఆటోలు, ఇతర వాహనాల ద్వారా తీసుకొని వెళ్లే రైతులకు సాయంత్రం వరకు ఉండి అమ్ముకునేవారు. ఇప్పుడు ఎక్కువ మొత్తంలో టమాటా మార్కెట్లకు రావడంతో, అమ్ముడు పోనివాటిని సాయంత్రం వరకు చూసి ఉచితంగా పంపిణీ చేయడం, లేదా కోతులకు పోసి రావాల్సి వస్తోంది. ఇంటికి తీసుకొని వెళ్తే మళ్లీ రవాణా ఖర్చులు అవుతాయని, అందుకోసమే ఉచితంగా పంపిణీ చేస్తున్నామని కొందరు రైతులు చెబుతున్నారు.

**--నిల్వ చేయకపోవడంతోనే..**

ధాన్యం, ఇతర పంటలను విక్రయించే సందర్భంలో రైతులకు అనుకూల ధర లేకపోతే.. నిల్వ చేసుకొని ధర వచ్చిన తర్వాత అమ్ముతారు. కానీ టమాటా విషయంలో మాత్రం నిల్వ చేసే పరిస్థితి లేదు. ఇందుకు కావాల్సిన కోల్డ్ స్టోరేజీలు లేకపోవడంతో చెట్టుమీద పండిన టమాటా కోస్తే రెండు, మూడు రోజులకు మించి నిల్వ ఉండే పరిస్థితి ఉండదు. అందుకోసమే ధర ఎక్కువ.. తక్కువ ఉన్నా..అమ్మడం తప్ప మరో మార్గం లేదు.

**---పెట్టుబడి కూడా రావడం లేదు**

నాకున్న చెలకలో ఎకరం మేర కూరగాయలు వేస్తా. కూరగాయల మీద ప్రతీ సంవత్సరం రూ. లక్ష మేరకు లాభం వచ్చేది. ఈ ఏడాది రూ. 30 గుంటల్లో టమాటా వేశా. ఖర్చు రూ.50 వేలు దాటింది. కానీ ఇప్పుడు లాభం కాదు.. కదా పెట్టుబడి కూడా రావడం లేదు. నిల్వ చేసేటట్లు ఉంటే బాగుండేది. - బానోత్ బాలు, రేగడి తండా, మహబూబాబాద్

**--పెట్టె రూ. 100కే అడుగుతున్నారు**

20 గుంటల భూమిలో టమాటా సాగుచేశా. ఎక్కువమంది రైతులు ఈ ప్రాంతంలో టమాట పంటను సాగు చేయడం.. దిగుబడి ఎక్కువ రావడంతో ధర గణనీయంగా తగ్గింది. మార్కెట్‌లో కేజీ రెండు రూపాయల నుంచి నాలుగు రూపాయలకు కొనుగోలు చేస్తుండడంతో పెట్టుబడి మాట దేవుడెరుగు.. పంటను మార్కెట్‌కు తరలించినా రవాణా చార్జీలతోపాటు కోత కూలి కూడా రావడం లేదు. పెట్టె (25 కిలోలు) రూ.100కే అడుగుతున్నారు.

# 8 నెలల ఆపరేషన్.. 'ఇజ్రాయెల్ గ్రూప్' ఆటకట్టు

ఈ క్రమంలోనే ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించి.. ఆయా ఘటనల్లో వారిని మట్టుబెట్టాం. ఆదివారం నాటి ఎన్‌కౌంటర్‌తో ఈ ఆపరేషన్ ముగిసింది. ఈ కరడుగట్టిన ఉగ్ర ముఠాకు 'ఇజ్రాయెల్ గ్రూప్'గా పేరుంది. భద్రతా బలగాలతోపాటు పౌరులపైనా దాడులకు పాల్పడింది'' అని జమ్మూ ఐజీ భీమ్‌సేన్ మీడియాకు వెల్లడించారు. కిశ్‌త్‌వార్ జిల్లాలో ఇప్పుడు ముగ్గురు స్థానిక ఉగ్రవాదులు మాత్రమే మిగిలారని, వీరు దాదాపు రెండు దశాబ్దాలుగా యాక్టివ్‌గా ఉన్నారని చెప్పారు. దేశ వ్యతిరేక శక్తులు ఎక్కడ దాక్కున్నా వెంటాడి ఏరివేస్తామని సీఐఎఫ్ డెల్టా జీవోసీ మేజర్ జనరల్ ఏపీఎస్ బల్ హెచ్చరించారు. ''2025 ఏప్రిల్‌లో తొలుత ముగ్గురు ఉగ్రవాదులను బలగాలు మట్టుబెట్టాయి. ఫిబ్రవరి 4 ఒకరిని అంతమొందించాయి. ఫిబ్రవరి 22న మరో ముగ్గురు మృతి చెందారు'' అని తెలిపారు. ఇంటెలిజెన్స్ సమాచారం, డ్రోన్లతో నిఘా, నైట్ విజన్ పరికరాలు, వేగంగా బలగాల సమీకరణ వంటి చర్యలతో సత్ఫలితాలు సాధించినట్లు చెప్పారు.



# అంజయ్య నగర్ స్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించాలి : ఆంజనేయులు సాగర్



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న ఆంజనేయులు సాగర్ తదితరులు


అంజయ్య నగర్ డివిజన్ వాసులతో కలిసి సీఎంసి కార్యాలయంలో ఆంజనేయులు సాగర్

- ప్రజావాణిలో సీఎంసి అధికారులకు ఫిర్యాదు
- త్రాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని అధికారులకు వినతి

ఈకబురు, శేరిలింగంపల్లి : అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ స్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించి, అభివృద్ధి చేయాలని డివిజన్ సీనియర్ నాయకులు ఎం.ఆంజనేయులు సాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అంజయ్య నగర్ డివిజన్ సమస్యలపై సిఎంసి అధికారులకు ఫిర్యాదు చేశారు. అంజయ్య డివిజన్ వాసులతో కలిసి అధికారులను కలిసిన ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ బస్తి స్మశాన వాటికలో కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలనీవాసులు ఎవరైనా చనిపోతే స్మశాన వాటిక వరకు వెళ్లేందుకు సరైన రహదారి లేదన్నారు. వర్షా కాలంలో చెరువులా మారుతున్న స్మశాన వాటికలో నీళ్లతో నిండిన గుంతల్లోనే ఖననం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంజయ్య నగర్ స్మశాన వాటికకు వెళ్లేందుకు రహదారి నిర్మాణం చేపట్టాలని, స్మశాన వాటిక లోపల కనీస వసతులైన దహన వాటిక, మంచినీటి వసతి, స్నానాల గదులు, కర్మకాండల మండపం నిర్మించాలని కోరారు. దీంతోపాటు వేసవికాలం సమీపిస్తున్న తరుణంలో అంజయ్య నగర్ డివిజన్ వ్యాప్తంగా మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వేసవికాలంలో డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్, సిద్ధిక్ నగర్, రాజీవ్ నగర్, పిజెఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రతి సంవత్సరం మంచినీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ముందు జాగ్రత్తగా స్పందించి వేసవికాలంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిక్ నగర్ కాలనీ జనరల్ సెక్రటరీ రవీందర్ రెడ్డి, నాయకులు సంతోష్, రాము, శ్రీను, భాస్కర్ రెడ్డి, జీ నరసింహ, తిరుపతయ్య సాగర్, రామకృష్ణ, భీం సాగర్, రాజేందర్ రెడీ, వీరేష్, విజేందర్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతం .. పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం



ఇందులో భాగంగా పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జనసేన తెలంగాణ విభాగం ప్రకటన విడుదల చేసింది. సభ్యత్వ నమోదు కార్యక్రమం కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. జనసేన పార్టీ 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా నిర్వహించాలని పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో పార్టీని 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో బలంగా తీసుకెళ్లి, సంస్థాగతంగా బలోపేతం చేయడానికి జిల్లాలవారీగా కొంతమంది నాయకులకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలను అప్పగించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నూతనంగా ఏర్పడిన మూడు కార్పొరేషన్‌లకు వేర్వేరు ఇన్‌ఛార్జులను నియమించారు. జనసేన పార్టీ ఉపాధ్యక్షులు బొంగునూరి మహేందర్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్, పార్టీ నాయకులు రాధారాం రాజలింగం, కావ్య మండపాక, శిరీష పొన్నూరి రాష్ట్రస్థాయిలో పర్యవేక్షిస్తారని ఆ ప్రకటనలో జనసేన పార్టీ తెలిపింది. ఆయా పార్లమెంట్ పరిధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాల బాధ్యతను రసువుకు నాయకులకు అప్పగించారు.

# ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త



మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాకు వెల్లడించారు. "ఉద్యోగుల ఆరోగ్య భద్రత, ప్రమాదాల విషయంపై కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులు, పింఛనర్లకు భారం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. రాష్ట్రంలో 7.56 లక్షల మంది ఉద్యోగులు, పింఛనర్లు ఉన్నారు.ఉద్యోగి చనిపోతే రెగ్యులర్ బెనిఫిట్లతో పాటు అదనంగా రూ.10 లక్షలు వచ్చేలా పథకం తీసుకొస్తాం. 17.7 లక్షల మంది ఉద్యోగులు, పింఛనర్లకు డిజిటల్ హెల్త్ ఎంప్లాయ్ కార్డులు అందజేస్తాం. 1998 వ్యాధులకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 652 ఆస్పత్రుల్లో చికిత్స అందేలా ఏర్పాట్లు చేస్తాం. రాబోయే 23 రోజుల నుంచి ఎంప్యానల్ ఆస్పత్రుల్లో చికిత్సకు ఏర్పాట్లు చేస్తాం. ఉద్యోగుల బేసిక్ పే నుంచి 1.5 శాతం ట్రస్టుకు జమ అయ్యేలా చర్యలు చేపడతాం. ఉద్యోగుల నుంచి రూ.528 కోట్లు సేకరిస్తాం. దీనికి అదనంగా ప్రభుత్వం మరో రూ.528 కోట్లు జత చేసి.. ట్రస్టు ఖాతాలో జమ చేస్తుంది. సీఎస్, సభ్యుల ఆధ్వర్యంలో ట్రస్టు నిర్వహణ ఉంటుంది" అని మంత్రి పొంగులేటి వివరించారు.

# బాల్క సుమన్ బెయిల్, కస్టడీ పిటిషన్లపై విచారణ వాయిదా



ఈ నేపథ్యంలో బాల్క సుమన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై జిల్లా ప్రధాన న్యాయస్థానంలో సోమవారం విచారణ జరిగింది. వాదనలు విన్న న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. మరోవైపు బాల్క సుమన్‌ను తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ.. పోలీసులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. కస్టడికి ఇవ్వాల్సిన అవసరం లేదని బాల్క సుమన్ తరుపున న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేస్తూ వాదనలు వినిపించారు. దీనిపైనా విచారణ మంగళవారానికి వాయిదా పడింది.

# క్రికెట్ మ్యాచ్ చూస్తానంటే.. జగన్‌కు టికెట్ తీసుకుంటా: లోకేశ్



ఈ కబురు, అమరావతి: వైకాపా హయాంలో సాక్షి, భారతి సిమెంట్స్ రూ.1000 కోట్లు లబ్ధి పొందాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఆయన చిట్‌చాట్‌గా మాట్లాడారు." హెరిటేజ్ ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందలేదు. కిలో నెయ్యి రూ.360కి ఎక్కడ దొరికినా అది కల్తీయే. మార్కెట్‌లో రూ.1000పైన ఉంటే.. రూ.360కి ఇచ్చేది కల్తీ కాక మరేంటి? ఇందాపూర్ డెయిరీ.. హెరిటేజ్‌కు కో కంపెనీ అనడం విడ్డూరంగా ఉంది. కో కంపెనీ అనేది ఉండదనే విషయం బొత్సకు తెలియదా? ఆధారాలు లేకున్నా.. హెరిటేజ్‌పై సెబీకి ఫిర్యాదు చేశారు. మ్యాచ్ చూడడానికి స్టేడియంకు వెళ్లాలా అని జగన్ అంటున్నారు. టీ20 ప్రపంచకప్‌లో ఇండియా ఫైనల్‌కు చేరితే తప్పనిసరిగా వెళ్తా. మ్యాచ్ చూసేందుకు వస్తానంటే పులివెందుల ఎమ్మెల్యేకూ టికెట్ తీసుకుంటా" అని నారా లోకేశ్ అన్నారు. బడ్జెట్‌లో చర్చ కావాలని మండలిలో వైకాపా సభ్యులు అనడం హాస్యాస్పదంగా ఉందని, చర్చ కోరుకున్నవాళ్లు 4 రోజులు సభను ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు.

# తిరుమల క్యూలైన్‌లో పాముకాటు ప్రచారం.. అసలు వాస్తవం ఇదీ!



ఈ కబురు : తిరుమల క్యూలైన్‌లో ఓ భక్తురాలు పాముకాటుకు గురైనట్లు జరుగుతున్న ప్రచారాన్ని తితిదే(TTD) ఖండించింది. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు వాస్తవంగా అక్కడేం జరిగిందో వివరిస్తూ ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం సైతం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. "తిరుమల క్యూలైన్‌లో భక్తురాలు పాముకాటుకు గురైనట్లు కొందరు చేస్తున్న ప్రచారంలో నిజం లేదు. వాస్తవానికి జరిగింది ఏమిటంటే..వరంగల్‌కు చెందిన శరత్ బాబు, మౌనిక దంపతులు ఆదివారం (ఫిబ్రవరి 22) రాత్రి స్వామి దర్శనం కోసం టాక్సీలో ఎస్వీ మ్యూజియం వద్దకు వచ్చారు. ఆర్.బి.సెంటర్ పార్కింగ్ ఏరియా వద్దకు రాగానే తన కాలికి పసుపు రాసుకునే ఉద్దేశంతో మౌనిక కారు నుంచి కిందకు దిగారు. ఆ సమయంలో తన కాలికి ఏదో తాకడంతో ఆమె భయంతో గట్టిగా అరిచారు. వెంటనే ఆమె భర్త శరత్ బాబు వెతికి చూడగా అక్కడ ఒక పాము పిల్ల కనిపించింది. దీంతో అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది మౌనికను తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. భక్తురాలిని పరీక్షించిన వైద్యులు ఆమె పాముకాటుకు గురికాలేదని నిర్ధారించారు. అయినప్పటికీ ఆమె శ్రేయస్సుని దృష్టిలో ఉంచుకొని ముందు జాగ్రత్తగా తిరుపతిలోని స్విమ్స్‌లో చేర్చారు. స్విమ్స్ వైద్యులు సైతం ఆమె పాము కాటుకు గురికాలేదని చెప్పారు. అలాగే, అక్కడ కనిపించిన పాము కూడా విషపూరితం కాదని తేలింది. ఈ ఘటన జరిగిన వెంటనే తితిదే సిబ్బంది స్పందించిన తీరుకు ఆ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఉదయం ఆ దంపతులు స్వామిని దర్శించుకున్నారు. జరిగింది ఇదీ. అందువల్ల కొందరు చేస్తున్న ఫేక్ ప్రచారాలను భక్తులు నమ్మొద్దు" అని విజ్ఞప్తి చేసింది.

# ఝార్ఖండ్‌లో కూలిన ఎయిర్ అంబులెన్స్.. ఏడుగురి మృతి

–రాంచీ నుంచి దిల్లీ వెళ్తుండగా దుర్ఘటన




ఈ కబురు, రాంచీ: కాలిన గాయాలతో విషమ పరిస్థితుల్లో ఉన్న రోగిని చికిత్స కోసం దిల్లీకి తరలించేందుకు ఝార్ఖండ్ రాజధాని రాంచీ నుంచి బయల్దేరిన ఎయిర్ అంబులెన్స్ సోమవారం రాత్రి కుప్పకూలిపోయింది. ఝార్ఖండ్‌లోని చత్రా జిల్లా సిమరియా వద్ద అటవీ ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో అందులో ఉన్న ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. రాత్రి 7.11కి బయల్దేరి 7.34 గంటల సమయంలో ఏటీసీతో సంబంధాలు కోల్పోయిన కాసేపటికి ఈ ఘోరం జరిగింది. రెడ్‌బర్డ్ ఎయిర్‌వేస్ ప్రై.లి.కి చెందిన బీచ్‌క్రాఫ్ట్ సీ90 విమానం రాత్రి 10 గంటలకు దిల్లీ చేరుకోవాల్సి ఉంది. చికిత్స కోసం 41 ఏళ్ల సంజయ్‌కుమార్‌ను దిల్లీకి తరలిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఎయిర్ అంబులెన్సులో రోగితోపాటు ఒక వైద్యుడు, ఒక పారామెడికల్ ఉద్యోగి, ఇద్దరు సహాయకులు, ఇద్దరు పైలట్లు ఉన్నారు. వీరంతా ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు వెల్లడించారు.

# డబ్బులిస్తానని పిలిచి హత్య

- ఆపై కారును రిజర్వాయర్‌లోకి నెట్టి ప్రమాదంగా చిత్రించే యత్నం
- వ్యాపార భాగస్వామే సూత్రధారి
- యూట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్ మృతి కేసు ఛేదించిన పోలీసులు
- నలుగురి అరెస్టు

ఈ కబురు : యూట్యూబర్ గొల్ల శ్రీనివాసులు ఎలియాస్ బొగ్గుల శ్రీనివాస్(48) హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు జలాశయంలోకి కారు దూసుకెళ్లిన ఘటనలో విగతజీవిగా కనిపించిన ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు.. అది ప్రమాదం కాదని హత్య అని.. శ్రీనివాస్ వ్యాపార భాగస్వామే ప్రధాన నిందితుడని తేల్చారు. ఏసీపీ తిరుపతిరెడ్డి ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామానికి చెందిన బొగ్గుల శ్రీనివాస్.. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. వీడియోలు చేస్తూ యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టేవారు. ఆయన, ఏపీలోని పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలంలోని పాకాలపాడుకు చెందిన మేకల వేణుమాధవ్‌రెడ్డి కర్నూలులోని సిల్వర్‌జూబ్లీ కళాశాలలో కలిసి చదువుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మళ్లీ కలుసుకుని పరిచయం పెంచుకున్నారు. శ్రీనివాస్‌కు 'బొగ్గుల బీబీక్యూ' పేరుతో జీఎస్టీ లైసెన్స్ ఉంది. వేణుమాధవ్‌రెడ్డి సొంతంగా 'మేకా ప్రాజెక్టు' అనే కంపెనీ పెట్టి సబ్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. బొగ్గుల బీబీక్యూ పేరు మీద ఫేక్ ఇన్‌వాయిస్ ఫైల్ చేసి లాభాలు పొందవచ్చని వేణుమాధవ్‌రెడ్డి చెప్పడంతో శ్రీనివాస్ ఒప్పుకొన్నారు. తన జీఎస్టీ లైసెన్స్ ఉపయోగించుకున్నందుకు లాభాల్లో 50% వాటా ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇలా 202225 వరకు జీఎస్టీ ఫైలింగ్‌తో రూ.90 లక్షలు సంపాదించారు. శ్రీనివాస్‌కు లాభాల్లో రూ.45 లక్షలు రావాల్సి ఉండగా రూ.15 లక్షలు మాత్రమే చెల్లించాడు. ఇదే క్రమంలో జీఎస్టీ ఫైలింగ్‌లో అవకతవకలపై వేణుమాధవ్‌రెడ్డి, శ్రీనివాస్‌కు జీఎస్టీ విభాగం నోటీసులు జారీ చేసింది. బొగ్గుల బీబీక్యూ లైసెన్సును అధికారులు రద్దు చేశారు. లైసెన్సు పునరుద్ధరణ విషయంలో వారి మధ్య వివాదం మొదలైంది. అది ముదరడంతో శ్రీనివాస్‌ను అడ్డు తొలగించుకునేందుకు వేణుమాధవ్‌రెడ్డి పథకం రచించాడు. పోకల కోటేశ్వరరావు, షేక్ అబ్దుల్ హఫీజ్, ఎండీ హజ్మత్ అలీలతో కలిసి హత్యకు పథకం రూపొందించాడు. వారికి రూ.5 లక్షలు సుపారీ చెల్లించాడు. ఈ నెల 13న శ్రీనివాస్‌కు ఫోన్ చేసి పెండింగ్ డబ్బులు చెల్లిస్తానని, విజయవాడకు వెళ్దామని చెప్పాడు. తన కారులో పోకల కోటేశ్వరరావుతో కలిసి శ్రీనివాస్‌ను ఎక్కించుకున్నాడు. వీరు మార్గంమధ్యలో మద్యం తాగారు. కొద్దిదూరం వెళ్లాక శ్రీనివాస్ నిద్రలోకి జారుకోగానే మధ్యలో హఫీజ్, హజ్మత్ అలీ వాహనంలోకి ఎక్కారు. ఈ నెల 14న తెల్లవారుజామున నకిరేకల్‌కు వచ్చాక కారును జనగామ వైపు వెళ్లే దారిలోకి మళ్లించారు. ఐరన్ రాడ్డుతో తలపై బలంగా మోది హత్య చేశారు.




ప్రమాదంగా చిత్రీకరించేందుకు కారును పాలేరు రిజర్వాయర్‌లోకి నెట్టి పరారయ్యారు. ఒంటిపై గాయాలు ఉండటంతో మృతిపై శ్రీనివాస్ సోదరులు అనుమానాలు వ్యక్తం చేశారు. కూసుమంచి సీఐ ఆధ్వర్యంలో స్పెషల్ టీంతో దర్యాప్తు ప్రారంభించి సాంకేతిక, ఇతర సాక్ష్యాల ఆధారంగా నలుగురిని అరెస్టు చేశారు.



## లాభాలతో ముగిసిన సూచీలు.. 25,700 ఎగువకు నిఫ్టీ

**ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాలతో ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంక్, హెల్త్‌కేర్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ట్రంప్ వివిధ దేశాలపై విధించిన సుంకాలు చెల్లుబాటు కావంటూ ఆ దేశ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కారణంగా ప్రపంచ మార్కెట్లతో పాటు మన సూచీలు రాణించాయి.**

సెన్సెక్స్ ఉదయం 82,906.83 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,814.71) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లో కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 83,486.15 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 479.95 పాయింట్ల లాభంతో 83,294.66 వద్ద ముగిసింది. నిఫ్టీ 141.75 పాయింట్ల లాభంతో 25,713 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.88గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. క్వాలిటీ వాల్స్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, ట్రెంట్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.38 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5147 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

### భారీగా పతనమైన ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేర్లు




ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ (IDFC First Bank) షేర్లు సోమవారం నాటి ట్రేడింగ్ ఆరంభం నుంచి భారీగా పతనం అవుతున్నాయి. ఒకానొక దశలో దాదాపు 20%శాతం పతనమయ్యాయి. ఆ తర్వాత కొద్దిగా కోలుకొన్నా.. భారీ నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. తమ బ్యాంక్ చండీగఢ్ బ్రాంచిలో రూ.590 కోట్ల మేరకు కుంభకోణం జరిగినట్లు అనుమానిస్తున్నామని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రకటించింది. గవర్నమెంట్ ఖాతాల నిర్వహణలో ఈ మోసం జరిగినట్లు భావిస్తున్నారు. ఫలితంగా ఇన్వెస్టర్లలో ఆందోళన తీవ్రమైంది. దీంతో నేడు ట్రేడింగ్ మొదలైన వెంటనే ఈ షేర్లు లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. ఇక ఉదయం 11.08 సమయంలో 15.28శాతం నష్టంతో రూ.70.75 వద్ద ట్రేడవుతున్నాయి. హరియాణా ప్రభుత్వ విభాగం ఒకటి ఈ బ్యాంకులో తమ ఖాతాను క్లోజ్ చేసి నిధులను బదిలీచేయమని కోరగా ఈ కుంభకోణం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సదరు విభాగ పుస్తకాల్లో నగదు.. బ్యాంక్‌ఖాతాలో మొత్తానికి సరిపోలకపోవడంతో అనుమానాలు మొదలయ్యాయి. దీంతో హరియాణా ప్రభుత్వంలోని పలు శాఖలు తమ ఖాతాలను సరిచూసుకోవడం మొదలుపెట్టాయి. అయితే చండీగఢ్ శాఖలోని ఖాతాల్లోనే ఈ సమస్య ఉన్నట్లు తెలుస్తోంది.

## ఈపీఎఫ్ఓ కీలక నిర్ణయం..
# అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు ఆటో రిఫండ్




ఈపీఎఫ్ఓలో (EPFO) ఎవరూ క్లెయిమ్ చేయని మొత్తాలకు (Unclaimed deposits) సంబంధించి కేంద్ర కార్మిక శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. భవిష్యనిధి సంస్థ వద్ద పోగుబడిన మొత్తాలను ఆయా చందాదారుల బ్యాంకు ఖాతాలో జమ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మొత్తం 31 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. తొలి దశలో 7 లక్షల మంది చందాదారులు లబ్ధి పొందనున్నారు. దీనికి సంబంధించిన పైలట్ ప్రాజెక్ట్‌ను త్వరలోనే ప్రారంభించనున్నట్లు కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు. ఈపీఎఫ్ఓలో సమీక్షా సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

మొత్తం 31.86 లక్షల ఖాతాలు నిర్వహణలో లేకుండా ఉన్నట్లు ఈపీఎఫ్ఓ గుర్తించింది. ఇందులో రూ.10,903 కోట్ల మేర నిల్వలు ఉన్నాయన్నది అంచనా. ఇందులో 7.11 లక్షల ఖాతాల్లో రూ.1000 మాత్రమే నగదు నిల్వలు ఉన్నట్లు ఈపీఎఫ్ఓ గుర్తించింది. ఈ ఖాతాల్లోని నగదు విలువ రూ.30.52 కోట్లుగా ఉంది. సాధారణంగా మూడేళ్లు పైబడి ఎలాంటి లావాదేవీలు లేని వాటిని నిర్వహణలో లేని ఖాతాలుగా గుర్తిస్తారు. ఇలాంటి మొత్తం ఇన్ ఆపరేటివ్ ఖాతాల్లో కొన్ని 20 ఏళ్లకు పైబడినవి కూడా ఉన్నాయి.

పైలట్ ప్రాతిపదికన తొలుత 7 లక్షల ఖాతాల అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఆధార్‌తో అనుసంధానం అయ్యి ఉన్న బ్యాంకు ఖతా, ఈపీఎఫ్ఓ దగ్గర ఉన్న వివరాల ఆధారంగా ఈ నగదును వేయనున్నారు. దీనికి ఎలాంటి క్లెయిమ్ సెటిల్‌మెంట్ డాక్యుమెంట్లు గానీ, డాక్యుమెంట్లు గానీ ఇవ్వాల్సిన అవసరం లేదు. పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం అయితే మిగిలిన 25 లక్షల నిస్తేజ ఖాతాలకు ఆటోమేటిక్ రిఫండ్ విధానాన్ని అనుసరించనున్నారు.

## ఎన్‌బీఎఫ్‌సీ విభాగంలోకి
# ఎయిర్‌టెల్ రూ.20వేల కోట్ల పెట్టుబడులు

ప్రముఖ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ తన నాన్ బ్యాంకింగ్ ఫైనాన్సియల్ కంపెనీ ఎయిర్‌టెల్ మనీ సేవల బలోపేతంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా వచ్చే కొన్నేళ్లలో రూ.20వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఇందులో ఎయిర్‌టెల్ 70 శాతం, ప్రమోటర్ గ్రూప్ భారతీ ఎంటర్‌ప్రైజెస్ మిగిలిన 30 శాతం పెట్టుబడిగా పెట్టనున్నాయి. ఎయిర్‌టెల్ మనీ ఫిబ్రవరి 13న ఆర్‌బీఐ నుంచి ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్స్‌ను పొందిన నేపథ్యంలో దీన్ని బలోపేతం చేయాలని ఎయిర్‌టెల్ నిర్ణయం తీసుకుంది. డిజిటల్ ఆర్థిక లావాదేవీల విషయంలో ఎయిర్‌టెల్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని భారతీ ఎయిర్‌టెల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ గోపాల్ విత్తల్ తెలిపారు. కస్టమర్ల డేటా, టెక్నాలజీ, వినియోగదారుల నమ్మకమే ఎయిర్‌టెల్ బలమని పేర్కొన్నారు. డిజిటల్ లెండింగ్ సర్వీస్ వ్యాపారాన్ని విస్తరించడం, భారతదేశమంతటా సులభమైన, సురక్షితమైన డిజిటల్ ఆర్థిక సేవలను అందించడం, రుణ సదుపాయాలను కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.




## ఒడిశాలో ఆర్‌బీఐ సురక్షిత డేటా కేంద్రం




కీలకమైన ఆర్థిక డేటాను కాపాడటానికి, ప్రధాన వ్యవస్థల కొనసాగింపును బలోపేతం చేసే ప్రయత్నాల్లో భాగంగా.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఒడిశాలో అత్యంత సురక్షిత (హై-సెక్యూరిటీ) డేటా కేంద్రాన్ని నిర్మించింది. దాడులకు సుదూరంగా, వ్యూహాత్మక ప్రదేశంలో, భూకంప తీవ్రత లేనిచోట దీనిని నిర్మించారు. ఇందుకోసం టైర్ 4 సర్టిఫికేషన్ డిజైన్‌ను వినియోగించారని సమాచారం. దేశ పశ్చిమ, ఉత్తర సరిహద్దులకు దూరంగా ఉన్న ఈ ప్రాంతంపైకి మిస్సైల్, డ్రోన్ దాడులు ఉండే అవకాశం తక్కువ. ఈ డేటా కేంద్రం ఆర్‌బీఐకి రెండోది. ప్రాథమిక డేటా కేంద్రం నవీ ముంబయిలోని ఖార్ఘర్‌లో ఉంది. ఈ కొత్త కేంద్రం ఆర్‌బీఐ కరెన్సీ నిర్వహణ, చెల్లింపు-పరిష్కార కార్యకలాపాలు, నియంత్రణ డేటా విధులకు మద్దతు ఇచ్చే ప్రధాన కంప్యూటింగ్ వ్యవస్థలను ఉంచడానికి రూపొందించారని అధికారులు వెల్లడించారు.

2023లో ఒడిశా (ఖోర్ధా)లోని ఇన్ఫో వ్యాలీ-2లో ఆర్‌బీఐ తన 18.55 ఎకరాల క్యాంపస్‌లో డేటా కేంద్రం పని ప్రారంభించినప్పుడు, అక్కడ ఎందుకనే సందేహాలు తలెత్తాయి. రవాణా, కార్యకలాపాలకు సంబంధించిన సమస్యల కంటే వ్యూహాత్మక అంశాలను పరిగణనలోకి తీసుకుంటే తాజా నిర్మాణాన్ని చేపట్టినట్లు సమాచారం. భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధం జరిగినప్పుడు, ఒక వాణిజ్య బ్యాంక్ తమ డేటా కేంద్ర కార్యకలాపాలను హఠాత్తుగా జయపుర నుంచి ముంబయికి తరలించింది. ఈ నేపథ్యంలోనే రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తూ కొత్త కేంద్రాన్ని నిర్మించారు. పైగా డేటా కేంద్రాలకు కావాల్సిన విద్యుత్తు, నీటికి ఈ ప్రాంతంలో కొదవ ఉండదు.

## బంగారం, వెండి దిగుమతులపై ఆందోళన లేదు: నిర్మలా సీతారామన్



ముంబయి: దేశంలోకి బంగారం, వెండి దిగుమతులు ఆందోళనకర స్థాయిలో ఏమీ లేవని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. వాటిని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) ఎప్పటికప్పుడు పరిశీలిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర బ్యాంకులు పెద్ద మొత్తంలో పసిడి కొనుగోలు చేస్తుండడమే బంగారం ధరల పెరుగుదలకు కారణమని చెప్పారు. బంగారం దిగుమతులపై ఆందోళన చెందడం లేదని, కరెంట్ ఖాతా లోటు నిర్వహించదగిన స్థాయిలోనే ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రాతో కలిసి ఏర్పాటు చేసిన సంయుక్త విలేకర్ల సమావేశంలో సోమవారం ఆమె మాట్లాడారు.

బ్యాంకులు తమ కోర్ బిజినెస్‌పై దృష్టి సారించాలని నిర్మలా సీతారామన్ సూచించారు. బీమా ఉత్పత్తులను మిస్ సెల్ చేయొద్దన్నారు. భారత్ వృద్ధి పథంలో పయనిస్తోందని, ఇందులో అందరూ భాగస్వాములు కావాలన్నారు. పారిశ్రామికవేత్తలు తమ పెట్టుబడులను పెంచాలని కోరారు. ఈ సందర్భంగా టారిఫ్‌ల అంశం ప్రస్తావనకు వచ్చింది. వివిధ దేశాలపై ట్రంప్ విధించిన టారిఫ్‌లను అక్కడి సుప్రీంకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. దీంతో భారత్ సహా అన్ని దేశాలపై 15 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ మార్పుల వల్ల భారత్‌పై ఎలాంటి ప్రభావం ఉండబోతోందని మీడియా ప్రశ్నించగా.. వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ అంశాన్ని సమీక్షిస్తోందని నిర్మలా సీతారామన్ అన్నారు. దీనిపై అప్పుడే వ్యాఖ్యానించడం తొందరపాటు నిర్ణయం అవుతుందన్నారు.

**ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌లో మోసంపై ఆర్‌బీఐ**

హరియాణాలోని చండీగఢ్ ఐడీఎఫ్‌సీ బ్యాంక్ శాఖలో జరిగిన రూ.590 కోట్ల మోసం ఘటనపై ఆర్‌బీఐ స్పందించింది. ఈ అంశాన్ని తాము పరిశీలిస్తున్నామని, ఇందులో వ్యవస్థీకృత మోసం ఏమీ గుర్తించలేదని గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. హరియాణా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఖాతాల్లో తమ ఉద్యోగులు, ఇతరులు చేసిన రూ.590 కోట్ల మోసాన్ని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఆదివారం బయటపెట్టిన సంగతి తెలిసిందే.

## ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590 కోట్ల మోసం



ముంబయి: హరియాణా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఖాతాల్లో తమ ఉద్యోగులు, ఇతరులు చేసిన రూ.590 కోట్ల మోసాన్ని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఆదివారం వెల్లడించింది. బ్యాంకింగ్ నియంత్రణ సంస్థ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఈ విషయాన్ని వెల్లడించడంతో పాటు పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది. చండీగఢ్‌లోని ఒక శాఖలో కొంతమంది ఉద్యోగులు హరియాణా రాష్ట్ర ప్రభుత్వ ఖాతాల్లో ప్రాథమికంగా అనధికారిక, మోసపూరిత కార్యకలాపాలు నిర్వహించినట్లు గుర్తించినట్లు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ పేర్కొంది. ఇతర వ్యక్తులు/సంస్థలు/కౌంటర్‌పార్టీలు కూడా ఇందులో భాగమయ్యే అవకాశం ఉందని తెలిపింది. ప్రస్తుతం మోసం విలువను రూ.590 కోట్లుగా అంచనా వేసింది.

తదుపరి సమాచారం, క్లెయిమ్‌ల ధ్రువీకరణ, రికవరీల ఆధారంగా తుది మొత్తాన్ని నిర్ణయిస్తామని వివరించింది. హరియాణా ప్రభుత్వ విభాగం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌తో బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహిస్తోందని.. రుణదాతకు వెల్లడించని తేదీన క్లోజర్, బ్యాలెన్స్ బదిలీ కోసం మరొక బ్యాంకుకు అభ్యర్థన అందిందని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ తెలిపింది. ఈ ప్రక్రియలో ఖాతాలోని బ్యాలెన్స్‌తో పోలిస్తే, పేర్కొన్న మొత్తంలో వ్యత్యాసం కనిపించింది. అలాగే ఈ నెల 18 నుంచి హరియాణా ప్రభుత్వ సంస్థల ఇతర ఖాతాల్లో కూడా ఇలాంటి సమస్యలు గమనించినట్లు వివరించింది.

## సుప్రీం తీర్పు ఎఫెక్ట్..
## రేపటి నుంచి ట్రంప్ టారిఫ్‌లు బంద్

ప్రపంచదేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎడాపెడా విధించిన టారిఫ్‌లు చెల్లవని అగ్రరాజ్య సుప్రీంకోర్టు ఇటీవల సంచలన తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో తీర్పునకు అనుగుణంగా అమెరికా యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. సుప్రీంకోర్టు చెల్లవని చెప్పిన టారిఫ్ (Trump Tariffs)లను మంగళవారం నుంచి వసూలు చేయబోమని యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ప్రకటించింది. 'అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టం' (ఐఈఈపీఏ) కింద ట్రంప్ (Donald Trump) విధించిన టారిఫ్‌ల వసూళ్లను.. అమెరికా కాలమానం ప్రకారం ఫిబ్రవరి 24వ తేదీ నుంచి నిలిపివేయనున్నట్లు పేర్కొంది. ఇదే సమాచారాన్ని ఇప్పటికే దిగుమతిదారులకు అందజేసినట్లు తెలిపింది. అయితే, ఇప్పటివరకు దిగుమతిదారులు చెల్లించిన టారిఫ్‌లను రిఫండ్ చేస్తారా? లేదా? అన్నదానిపై కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ స్పష్టతనివ్వలేదు.

ఈ టారిఫ్‌లు చెల్లవంటూ అమెరికా (USA) సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన మూడు రోజుల తర్వాత నిలిపివేతపై ప్రకటన వెలువడటం గమనార్హం. అధ్యక్షుడి అత్యవసర అధికారాల చట్టాన్ని వినియోగిస్తూ ప్రతీకార సుంకాలు విధించడాన్ని తప్పుబట్టిన అగ్రరాజ్య అత్యున్నత న్యాయస్థానం.. ఆ టారిఫ్‌లను రద్దు చేస్తూ ఫిబ్రవరి 20న తీర్పు వెలువరించింది. అయినప్పటికీ ట్రంప్ వెనక్కి తగ్గలేదు. ప్రపంచదేశాలపై 15 శాతం సుంకాలు విధిస్తున్నట్లు మళ్లీ ప్రకటన చేశారు. ఈ కొత్త టారిఫ్‌లు ఫిబ్రవరి 24వ తేదీ నుంచే అమల్లోకి వస్తాయని చెప్పినప్పటికీ.. ఇందుకు సంబంధించి ఎగ్జిక్యూటివ్ ఆదేశాలు ఇంకా జారీ కాలేదు. దీంతో కొత్త టారిఫ్‌లు రేపటి నుంచే వర్తిస్తాయా? లేదా అన్నదానిపై స్పష్టత లేదు. కాగా.. ఈ పరిణామాలతో భారత్‌పై సుంకాలు 50శాతం నుంచి 15 శాతానికి దిగొచ్చాయి.



# జననాయగన్ విడుదల మళ్లీ వాయిదా..

## కొత్త రిలీజ్ డేట్ ఇదే..!

**ఈ నెలలోనూ రిలీజ్ అయ్యే అవకాశం లేదంటున్న నిపుణులు**

**విజయ్ పుట్టిన రోజు సందర్భంగా జూన్ లో రిలీజ్ కు ఏర్పాట్లు**

**రివైజింగ్ కమిటీ రిపోర్టు కోసం ఎదురుచూస్తున్న నిర్మాతలు**

రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన నటుడు విజయ్ సినిమాలకు స్వస్తి చెప్పిన విషయం తెలిసిందే. నటుడిగా ఆయన ఆఖరి చిత్రం కావడంతో జననాయగన్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే, సెన్సార్ అభ్యంతరాల కారణంగా ఈ సినిమా విడుదల పదే పదే వాయిదా పడుతోంది. ఈ నెలలో జననాయగన్ థియేటర్లలో సందడి చేస్తుందని భావించిన అభిమానులకు మరోసారి నిరాశే ఎదురైంది. తాజాగా దీని రిలీజ్‌కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. న్యాయపరమైన చిక్కులు వీడితే విజయ్ పుట్టినరోజు కానుకగా జూన్ లో జననాయగన్ విడుదలయ్యే అవకాశం కనిపిస్తోంది.

### రివైజింగ్ కమిటీ రిపోర్టు కోసం వెయిటింగ్..

మొదట సంక్రాంతి కానుకగా జనవరిలో విడుదల కావాల్సిన ఈ చిత్రం, సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో ఆగిపోయింది. ఆ తర్వాత ఫిబ్రవరిలో రిలీజ్ చేయాలనుకున్నా, ప్రస్తుతం సినిమా రివైజింగ్ కమిటీ వద్ద ఉండటంతో ఈ నెలలో కూడా విడుదల సాధ్యం కాదని తేలిపోయింది. దీంతో మేకర్స్ ఇప్పుడు ఒక 'స్పెషల్ డే'ను ఫిక్స్ చేసినట్లు సమాచారం. జూన్ 22న విజయ్ పుట్టినరోజు ఉండటంతో జూన్ 18న ఈ సినిమాను విడుదల చేయాలని భావిస్తున్నారు.

### వివాదం నేపథ్యం..

హెచ్. వినోద్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా రాజకీయపరమైన అంశాల వల్ల సెన్సార్ చిక్కుల్లో పడింది. సెన్సార్ బోర్డు అభ్యంతరాలపై నిర్మాతలు సుప్రీంకోర్టును ఆశ్రయించగా, మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచ్‌కు వెళ్లాలని కోర్టు సూచించింది. కోర్టులో ఉన్న రిట్ పిటిషన్‌ను నిర్మాతలు ఉపసంహరించుకుని, ప్రస్తుతం సినిమాను రివైజింగ్ కమిటీకి పంపారు. కమిటీ రిపోర్ట్ ఆధారంగానే తదుపరి అడుగులు పడనున్నాయి.


# నేను ఎక్కడ ఉంటే అదే నా ఇల్లు: శ్రుతి హాసన్



**ఇల్లు అంటే భౌగోళిక ప్రదేశం కాదని చెప్పిన శ్రుతి హాసన్**
**చెన్నై, ముంబై, హైదరాబాద్‌లలో వివిధ రకాల ప్రేమను పొందుతానన్న నటి**
**ఈ భావనే జీవితంలో గొప్ప భద్రతనిచ్చిందని వ్యాఖ్య**
**నాన్న తప్ప మరే వ్యక్తి తనకు ఇల్లులా అనిపించలేదని స్పష్టం**

నటి, గాయని శ్రుతి హాసన్ 'ఇల్లు' అనే భావనపై తనదైన శైలిలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇల్లు అంటే మ్యాప్‌లోని ఒక ప్రదేశం కాదని, అది ఒక లోతైన, వ్యక్తిగతమైన ఫీలింగ్ అని ఆమె అన్నారు. పలు భాషా చిత్ర పరిశ్రమల్లో పనిచేసిన అనుభవంతో, తనకు ఇల్లు అనే భావనపై అవగాహన పూర్తిగా మారిపోయిందని శ్రుతి తెలిపారు. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ, "నాకు ఇల్లు అంటే అస్సలు భౌగోళిక ప్రదేశం కాదని గ్రహించాను. చెన్నైకి వెళ్లినప్పుడు నాకు అనంతమైన ప్రేమ, సౌకర్యం లభిస్తాయి. ముంబైలో మరో రకమైన ప్రేమను పొందుతాను. హైదరాబాద్‌లో పనిచేస్తున్నందున ఇక్కడ భిన్నమైన అనుబంధం ఉంటుంది" అని వివరించారు. ప్రతి నగరం తనకు ప్రత్యేకమైన అనుభూతిని పంచిందని ఆమె చెప్పారు. అయితే కాలక్రమేణా ఒక ముఖ్యమైన విషయాన్ని గ్రహించానని ఆమె తెలిపారు. "నన్ను ఎక్కడైనా వదిలేసినా, నేను సౌకర్యాన్ని వెతుక్కోగలను. ఒక ప్రదేశం, అక్కడి ప్రజలు, సంస్కృతి గురించి తెలుసుకుని, అందులో నాకు నచ్చిన దాన్ని నా సొంతం చేసుకుంటాను. నిజానికి నేను ఎక్కడ ఉంటే అదే నా ఇల్లు" అని శ్రుతి పేర్కొన్నారు. నాలో నాకు సౌకర్యంగా లేనప్పుడు, సొంత ఇంట్లో ఉన్నా సరే అసౌకర్యంగానే అనిపిస్తుందని అన్నారు. "నాకు నేనే ఇల్లు అనే భావన నా మెదడులో బలంగా నాటుకుపోయింది. జీవితంలో దేన్నైనా ఎదుర్కోవడానికి ఇది నాకు గొప్ప భద్రతను, భరోసాను ఇచ్చింది. ఈ ఆలోచన స్వార్థంగా అనిపించినా, నాకు బాగా పనిచేసింది. నాన్న (కమల్ హాసన్) తప్ప మరే వ్యక్తి నాకు ఇల్లులా సౌకర్యవంతంగా అనిపించలేదు" అని శ్రుతి స్పష్టం చేశారు.





# నెగెటివ్ కామెంట్లు, ట్రోల్స్‌పై సమంత రియాక్షన్!

- 'ట్రోల్స్ తనను కుంగదీయలేవన్న సమంత
- తన సోషల్ మీడియా పేజ్ కూడా శుభ్రంగా ఉండాలనుకుంటానని వ్యాఖ్య
- ఒత్తిడి ఎదురైనప్పుడు ధ్యానం ద్వారా ప్రశాంతత పొందుతానన్న సామ్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత తన సెకండ్ ఇన్నింగ్స్‌ను వేగంగా ప్లాన్ చేస్తోంది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న యాక్షన్ డ్రామా 'మా ఇంటి బంగారం' షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా, ఈ చిత్రాన్ని మే 15న సమ్మర్ కానుకగా విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సన్నద్ధమవుతోంది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే సామ్, తాజాగా తన అభిమానులతో ఇన్స్టాగ్రామ్ వేదికగా ముచ్చటించారు. ఈ సందర్భంగా నెటిజన్లు అడిగిన పలు ఆసక్తికర ప్రశ్నలకు ఆమె తనదైన శైలిలో సమాధానాలిస్తూ, ముఖ్యంగా తనపై వచ్చే విమర్శలపై ఘాటుగా స్పందించారు.

సోషల్ మీడియాలో తన వ్యక్తిగత జీవితం, ఆరోగ్యంపై వచ్చే నెగెటివ్ కామెంట్లు, ట్రోల్స్‌ను ఎలా ఎదుర్కొంటారని అడిగిన ప్రశ్నకు సమంత స్పందిస్తూ, ప్రశంసలు తనను పొంగిపోయేలా చేయవని, అలాగే విమర్శలు తనను కుంగదీయలేవని స్పష్టం చేశారు. అయితే తన డిజిటల్ స్పేస్‌లోకి ఎవరైనా కావాలని నెగిటివిటీని తీసుకొస్తే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. తన ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటానో, తన సోషల్ మీడియా పేజీని కూడా అలాగే ఉంచుకోవాలని భావిస్తానని ఆమె పేర్కొన్నారు. ఎవరినైనా బ్లాక్ చేశానంటే వారు తనను బాధపెట్టినట్లు కాదని, తన ప్రపంచంలోకి వారికి ప్రవేశం లేదని అర్థమని అన్నారు. ఇదే క్రమంలో సోషల్ మీడియా రీల్స్ వల్ల సమయం వృథా అవ్వడంపై కూడా ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నప్పుడు చదువుకోవడానికి ఒక టైమ్ టేబుల్ ఉండేదని, కానీ ఇప్పుడు రీల్స్ వల్ల ఏకాగ్రతను కోల్పోతున్నామేమో అనే భయం వేస్తోందని ఆమె అంగీకరించారు. ఈ పరిస్థితి నుంచి బయటపడటానికి తాను పుస్తకాలు చదవడం, పాడ్‌కాస్ట్‌లు వినడం వంటి నియమాలను పాటిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఒత్తిడి ఎదురైనప్పుడు ధ్యానం చేయడం ద్వారా ప్రశాంతత పొందుతానని, ఏదైనా ఫన్నీ విషయం ఎదురైతే కిందపడి మరీ నవ్వుతానని తన వ్యక్తిగత విషయాలను పంచుకున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే, 'ఓ బేబీ' వంటి సూపర్ హిట్ తర్వాత నందినీ రెడ్డి దర్శకత్వంలో సమంత చేస్తున్న 'మా ఇంటి బంగారం' మూవీపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రంతో పాటుగా రాజ్ & డీకే దర్శకత్వంలో 'రక్త బ్రహ్మాండం: ది బ్లడీ కింగ్‌డమ్' అనే వెబ్ సిరీస్‌లో కూడా సామ్ నటిస్తోంది. మొత్తానికి వరుస ప్రాజెక్టులతో సమంత మళ్ళీ టాలీవుడ్‌లో తన హవాను కొనసాగించడానికి సిద్ధమవుతోంది.



# ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్...

పెళ్లిని అధికారికంగా ప్రకటించిన

## విజయ్ దేవరకొండ, రష్మిక



**టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తమ పెళ్లి కబురును అధికారికంగా ప్రకటించారు. ఎంతో కాలంగా వీరిద్దరి వివాహంపై వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ, తమ పెళ్లి వేడుకకు 'ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్' అని పేరు పెట్టినట్టు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ పేరును తమ అభిమానుల గౌరవార్థం పెట్టినట్టు చెప్పి వారికి ప్రత్యేకమైన గౌరవాన్ని ఇచ్చారు.**

తమ వివాహానికి ఈ పేరు పెట్టడం వెనుక ఉన్న కారణాన్ని ఈ జంట వివరించింది. 'విరోష్' (VIROSH) అనే పేరును ఏ వెడ్డింగ్ ప్లానర్లు, కుటుంబ సభ్యులు సూచించలేదని, ఎన్నో ఏళ్ల క్రితం తమ అభిమానులు ప్రేమతో సృష్టించినదేనని తెలిపారు. తాము ఎలాంటి ప్రణాళికలు వేసుకోకముందే, అభిమానులు తమ బంధానికి ఓ అర్థం ఇచ్చారని వారు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సోషల్ మీడియాలో ఓ ఉద్వేగభరితమైన నోట్‌ను పంచుకున్నారు. "మా ప్రియమైన వారికి, మేము ఎలాంటి ప్రణాళికలు వేసుకోకముందే, మా కోసం మేము ఏదీ ఎంచుకోకముందే.. మీరు అప్పటికే ఓ అభిప్రాయానికి వచ్చేశారు. ఎంతో ప్రేమతో, మీరు మాకు ఒక పేరు ఇచ్చారు. మమ్మల్ని 'విరోష్' అని పిలిచారు. కాబట్టి ఈ రోజు నిండు మనసుతో, మా ఈ కలయికకు మీ గౌరవార్థం 'ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్' అని పేరు పెడుతున్నాం. మమ్మల్ని ఇంతగా ప్రేమించినందుకు ధన్యవాదాలు. మీరు ఎప్పటికీ మాలో భాగమే!" అని రాసుకొచ్చారు. ఇదిలా ఉండగా, ఇటీవలే విజయ్, రష్మికల పెళ్లి పత్రిక అంటూ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ పత్రిక ప్రకారం, ఈ జంట ఫిబ్రవరి 26న ఒక చిన్న, సన్నిహిత వేడుకలో వివాహం చేసుకోనున్నారు. ఆ తర్వాత మార్చి 4న హైదరాబాద్‌లో గ్రాండ్ రిసెప్షన్ జరగనున్నట్టు ప్రచారం జరుగుతోంది.


# వర్మ వర్సెస్ యష్ అభిమానులు



వివాదాలకు కేరాఫ్ అడ్రస్ అయిన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి సినీ ఇండస్ట్రీలో కలకలం రేపారు. కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న 'టాక్సిక్', ఆదిత్య ధర్ తెరకెక్కిస్తున్న 'ధురంధర్-2' చిత్రాల మధ్య జరగబోయే బాక్సాఫీస్ పోరును ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ రెండు సినిమాల పోటీని 'డేవిడ్ వర్సెస్ గోలియత్' యుద్ధంతో పోల్చిన ఆర్జీవీ, భారీ బడ్జెట్ల కంటే కథలోని తెలివితేటలే గెలుస్తాయని తనదైన శైలిలో విశ్లేషించారు. అయితే 'టాక్సిక్' వంటి మాస్ సినిమాలు ప్రేక్షకులను మూర్ఖులుగా భావిస్తాయని, అదే 'ధురంధర్-2' వంటి చిత్రాలు మెదడుకు పని చెబుతాయని ఆయన చేసిన కామెంట్స్ తీవ్ర దుమారాన్ని రేపాయి.

వివాదం ముదరడంతో వెంటనే స్పందించిన ఆర్జీవీ, 'రాక్షసులందరికీ నా సమాధానం ఇదే' అంటూ మరో పోస్ట్‌తో క్లారిటీ ఇచ్చారు. తాను కేవలం రెండు రకాల సినిమా శైలుల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని మాత్రమే చెప్పానని, ఏ ఒక్కరినీ వ్యక్తిగతంగా కించపరచడం తన ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. అంతేకాకుండా మార్చి 19న థియేటర్లలో లైట్లు ఆరిపోయినప్పుడు అసలు సిసలు 'భారతీయ సినిమా' ఏదో తేలిపోతుందని వ్యాఖ్యానించారు. వర్మ వివరణతో ప్రస్తుతానికి వివాదం సద్దుమణిగినట్లు కనిపిస్తున్నా, బాక్సాఫీస్ వద్ద మాత్రం పోటీ రసవత్తరంగా మారనుంది.

# జడల గెటప్‌లో నాని మాస్ డ్యాన్స్..




నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా, 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి 'ఆయాషేర్' అనే పాట ప్రోమోను చిత్రబృందం ఇవాళ విడుదల చేసింది. ఈ ప్రోమోలో నాని రెండు జడల గెటప్‌లో మాస్ స్టెప్పులతో ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తూ కనిపించి అభిమానులను ఆకట్టుకున్నారు. అనిరుధ్ రవిచందర్ స్వరపరిచిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ కుమార్ సాహిత్యం అందించారు. అద్దుల జంగిరెడ్డి, అకునూరి దేవయ్య, అనిరుధ్ కలిసి ఆలపించారు. పూర్తి పాటను రేపు విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై ఈ చిత్రం నిర్మితమవుతోంది. నిజానికి ఈ సినిమాను మార్చి 26న విడుదల చేయాలని భావించినా, కొత్త తేదీగా ఆగస్టు 21ని ఖరారు చేశారు. ఈ కొత్త విడుదల తేదీ సినిమాకు బాగా కలిసొచ్చే అంశం. ఓనం, మిలాద్‌ఉన్‌నబీ, రక్షా బంధన్ వంటి పండగలు వరుసగా ఉండటంతో బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టేందుకు మంచి అవకాశం లభించనుంది. బ్లాక్‌బస్టర్ హిట్ 'దసరా' తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో 'ది ప్యారడైజ్'పై అంచనాలు రెట్టింపయ్యాయి. ఇటీవలే వందలాది మంది డ్యాన్సర్లతో నాని ఇంట్రడక్షన్ సాంగ్‌ను భారీ సెట్‌లో చిత్రీకరించారు. ఈ చిత్రంలో సంపూర్ణేష్‌బాబు 'బిర్యానీ' అనే పాత్రలో, బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయల్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళంతో పాటు ఇంగ్లీష్, స్పానిష్, బెంగాలీ భాషల్లో కలిపి మొత్తం 8 భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌లో నాగచైతన్య సందడి



గోవాలో జరిగిన 'ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్'లో ప్రముఖ నటుడు నాగచైతన్య(Naga Chaitanya) సందడి చేశారు. రౌండ్-4లో భాగంగా నిర్వహించిన రేసింగ్ ఈవెంట్‌కు ఆయన హాజరయ్యారు. తన సొంత మోటార్‌స్పోర్ట్ టీమ్ 'హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్' కూడా ఈ రేస్‌లో పాల్గొంది. ఈ నేపథ్యంలో రేస్ ట్రాక్ వద్ద నాగచైతన్య తన టీమ్‌ను ఉత్సాహపరిచారు. ఈ రేసింగ్ ఈవెంట్‌కు మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ, బాలీవుడ్ నటుడు జాన్ అబ్రహాం తదితరులు హాజరయ్యారు.

# 'ఉస్తాద్ భగత్ సింగ్'.. ఎట్టకేలకు క్లారిటీ ఇచ్చిన హరీశ్ శంకర్

'ఉస్తాద్ భగత్‌సింగ్'లో ఎలాంటి రాజకీయ అంశాలు ఉండవని, పవన్‌కల్యాణ్‌ను (Pawan Kalyan) ఎంటర్‌టైన్‌మెంట్ మోడ్‌లో చూస్తారని దర్శకుడు హరీశ్ శంకర్ స్పష్టత ఇచ్చారు. తాజాగా ఈ మూవీ నుంచి 'ఆరా ఆఫ్ ఉస్తాద్' (Aura Of Ustaad) పాటను విడుదల చేశారు. దీంతో ప్రస్తుత రాజకీయాలపై సెటైర్లు, విమర్శలు ఉంటాయని పలువురు భావిస్తుండటంతో దీనిపై హరీశ్ శంకర్ స్పష్టతనిచ్చారు.



''ఆరా ఆఫ్ ఉస్తాద్' పాటకు మంచి స్పందన వస్తోంది. అభిమానులు వాళ్ల ఎడిట్స్ పంపిస్తుంటే ఆనందంగా ఉంది. దీనికి 'ట్రాన్స్‌బస్టర్' అని పేరు పెట్టాలని నా స్నేహితుడు సలహా ఇచ్చాడు. చాలా బాగుంది. ఇది పవన్‌కల్యాణ్ వ్యక్తిత్వానికి, పర్సనల్ యాటిట్యూడ్‌కు దగ్గరగా ఉండటంతో కొంతమంది కొన్ని ఆసక్తికర అంశాలను లేవనెత్తారు. ప్రస్తుత రాజకీయాలపై ఇందులో సెటైర్లు ఉంటాయా? అని అడుగుతున్నారు. ఒకళ్లిద్దరు అడిగి ఉంటే నేను పెద్దగా స్పందించి ఉండేవాడిని కాదు. ఈ సినిమా (Ustaad Bhagat Singh) మొదలు పెట్టిన దగ్గరి సినిమా, రాజకీయాలు వేర్వేరని పవన్‌కల్యాణ్‌గారు మాతో చెబుతూనే వచ్చారు. ఆయనా అదే పాటించారు. సైద్ధాంతిక విభేదాలు ఉన్నా పక్కనపెట్టి ప్రకాశ్‌రాజ్‌తో పవన్‌కల్యాణ్ నటించారు. వ్యక్తిగతంగా ఆయన ఎవరినీ టార్గెట్ చేయరు''

''సినిమాలో డైలాగ్స్, సన్నివేశాలు, రిఫరెన్స్‌లు చూసి ఏ ఒక్కరూ చిన్న బుచ్చుకునేలా చేయొద్దు. సినిమా అంతిమ లక్ష్యం వినోదం పంచడం. అది దెబ్బతింటుంది' అన్నారు. 'గాజు పగిలితే..' అనే డైలాగ్ హీరో క్యారెక్టర్‌ను ఎలివేట్ చేసేలా రాశామంతే. ఇంకొకరిని తక్కువ చేసేలా చేయలేదు. ఆయనకు అన్ని పార్టీల్లో ఫ్యాన్స్ ఉన్నారు. ఓట్లు ఎవరికి వేసినా సినిమా అంటే ఈయన దగ్గరికే వస్తారు. ఇంకా గొప్ప విషయం ఏంటంటే, 'అన్నా మనకు రాజకీయాలు వద్దు. ఎంటర్‌టైన్‌మెంట్ కావాలి' అని ఫ్యాన్సే కోరారు. నిజంగా మీకు హ్యాట్సాఫ్. కల్యాణ్‌గారిని ఫాలో అవడమంటే, స్టైల్, స్వాగ్‌ను మాత్రమే కాదు, ఆయన సిద్ధాంతాన్ని ఫాలో అవుతున్నారు. ఏ పార్టీని కానీ, ఏ వర్గాన్ని కానీ కించపరిచేలా ఈ సినిమాలో డైలాగ్స్ ఉండవు అని అన్నారు'' అని హరీశ్ శంకర్ స్పష్టత ఇచ్చారు.

## ఒకే సీజన్‌లో 55 వికెట్లు.. అతడికి జాతీయ జట్టులో ఛాన్స్ ఎప్పుడు?



రంజీ ట్రోఫీ చరిత్రలో జమ్ము కశ్మీర్ తొలిసారి ఫైనల్‌కు చేరుకుంది. జట్టు విజయాల్లో పేసర్ అకిబ్ నబీదే కీలక పాత్ర. ఈ సీజన్‌లో అతడు 55 వికెట్లు తీశాడు. 29 ఏళ్ల నబీని జాతీయ జట్టులోకి తీసుకోవాలంటూ డిమాండ్లు వస్తున్నాయి. టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్‌తోపాటు జమ్ముకశ్మీర్ మాజీ సారథి పర్వేజ్ రసూల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇర్ఫాన్ కూడా జమ్ముకశ్మీర్ తరఫున దేశవాళీ క్రికెట్‌లో ఆడాడు. గాయాలు కాకుండా ఉండటం ఎంత కష్టమో క్రీడాకారుడికే తెలుస్తుందని రసూల్ అన్నాడు. బ్యాటర్లను ఇబ్బంది పెట్టే స్పెషల్ బౌలింగ్ నైపుణ్యం నబీకి ఉందని పఠాన్ వెల్లడించాడు.

**రెండువైపులా స్వింగ్ చేస్తాడు: పఠాన్**

"అకిబ్ నబీ బౌలింగ్ చాలా స్పెషల్. కుడి, ఎడమ చేతివాటం బ్యాటర్లకు బౌలింగ్ చేసేటప్పుడు కాస్త లేట్ మూమెంట్‌తో బంతిని సంధిస్తాడు. డిఫెన్స్ ఆడినా సరే బ్యాటర్లు ఔటవుతారు. ఈ సీజన్‌లో ఇప్పటికే 55 వికెట్లు తీయడం సాధారణ విషయం కాదు. మరొక మ్యాచ్ కూడా ఉంది. అందులోనే మెరుగైన బౌలింగ్ చేస్తాడని భావిస్తున్నా. అందుకే, అతడిని జాతీయ జట్టులోకి తీసుకోవాలని చెబుతున్నా. తప్పకుండా త్వరలోనే వస్తాడు. పెద్ద మ్యాచుల్లో వికెట్లు తీయడం మొదలుపెడితే మాత్రం అతడిని ఆపడం చాలా కష్టం'' అని ఇర్ఫాన్ పఠాన్ వెల్లడించాడు.

**తీసుకోవాల్సిందే..: పర్వేజ్**

"ప్రదర్శన లేదా శ్రమించడంలో ఆకిబ్ సాధించాల్సిందేమీ లేదు. భారత జట్టులోకి ఛాన్స్ ఇచ్చే సమయం ఇదే. తొలిసారి నేను అండర్23 సమయంలో నబీని గుర్తించా. అక్కడ నుంచి రంజీకి ఎంపిక చేశాం. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టేస్తున్నాడు. కేవలం బంతితోనే కాకుండా బ్యాట్‌తోనూ రాణించాడు. అందుకే, అతడిని ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు తీసుకుంటారనేది ప్రశ్న. లోయర్ ఆర్డర్‌లోనూ నమ్మదగ్గ బ్యాటర్. హిట్టింగ్ మాత్రమే కాకుండా ఇన్నింగ్స్‌ను నిర్మించగల ఆటగాడు'' అని పర్వేజ్ రసూల్ తెలిపాడు.

## భారత అభిమానులకు రెండో ఇష్టమైన జట్టుగా కివీస్: డారిల్ మిచెల్



టీమ్‌ఇండియా తర్వాత.. భారత క్రికెట్ ఫ్యాన్స్ ఎక్కువగా న్యూజిలాండ్ జట్టును అభిమానిస్తుంటారు. ఆ జట్టు ఏ టోర్నీలో ఆడినా మద్దతుగా నిలుస్తుంటారు. అందుకే, తమ జట్టును భారత్‌లో రెండో ఫేవరెట్ టీమ్‌గా పిలుస్తారని న్యూజిలాండ్ ఆటగాడు డారిల్ మిచెల్ అన్నాడు. టీ20 ప్రపంచ కప్‌లోనూ టీమ్‌ఇండియా ఫ్యాన్స్ తమకు మద్దతు నిలుస్తున్నారని చెప్పాడు. ఒకవేళ తమ జట్టు భారత్‌తో ఆడుతున్నా సరే.. కొందరు అభిమానులు బ్లాక్ జెర్సీలను ధరిస్తారని పేర్కొన్నాడు.

"భారత అభిమానులకు మేం రెండో ఫేవరెట్ జట్టు అని భావిస్తున్నాం. ఇక్కడి అభిమానుల మద్దతు దక్కడం అద్భుతం. టీ20 ప్రపంచ కప్‌లో భారత్‌తో మ్యాచ్ తలపడాల్సి వచ్చినప్పుడు మా టీమ్‌కూ కొందరు సపోర్ట్‌గా బ్లాక్ జెర్సీలను ధరిస్తారు. అందుకే, భారత్ వేదికగా మ్యాచులు ఆడటమంటే మాకు చాలా ఇష్టం" అని మిచెల్ వెల్లడించాడు. లీగ్ స్టేజ్‌లో కివీస్ ఆడిన మ్యాచులకు భారత్ వేదికగా నిలిచింది. ఇప్పుడు సూపర్-8లో కొలంబోలోనే మ్యాచులను ఆడాల్సి ఉంది. పాక్‌తో మ్యాచ్ వర్షం కారణంగా రద్దైన సంగతి తెలిసిందే.

**మా దగ్గర పిచ్‌లే వేరు..**

"న్యూజిలాండ్‌లో మేం పేస్, బౌన్స్, పచ్చికతో కూడిన పిచ్‌లపై ఆడుతూ పెరిగాం. అయితే, ప్రపంచవ్యాప్తంగా ఆడిన అనుభవంతో ఇక్కడ పరిస్థితులు కొత్తగా ఏమీ అనిపించడం లేదు. నాణ్యమైన క్రికెట్ ఆడి టీ20 ప్రపంచ కప్‌ను గెలిచేందుకు ప్రయత్నిస్తాం. అయితే, భవిష్యత్తు కంటే వర్తమానంలో ఉండి పరిస్థితులకు తగినట్టుగా ఆడతాం. ఫిన్ అలెన్, టిమ్ సీఫెర్ట్ జోడీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. మా జట్టు సమతూకంగా ఉంది. టీమ్‌ఇండియాతో సిరీస్ సమయంలోనే కూర్పును సెట్ చేసుకోగలిగాం. టీ20ల్లో పవర్‌ప్లే చాలా కీలకం. మిడిల్ ఓవర్లలోనూ దూకుడుగా ఆడటం ముఖ్యమే. స్పిన్‌ను ఎదుర్కొని పరుగులు చేయాల్సిన అవసరం ఉంది. 10 ఓవర్ల తర్వాత నుంచి నేను ఫినిషర్ పాత్రను తీసుకొనేందుకు ఇష్టపడతా" అని మిచెల్ వెల్లడించాడు.

### శాండ్ పేపర్ వివాదం... తర్వాత

# తొలిసారిగా దక్షిణాఫ్రికాలో ఆసీస్ పర్యటన



**సెప్టెంబరు, అక్టోబరులో దక్షిణాఫ్రికాలో పర్యటించనున్న ఆస్ట్రేలియా**

**2026-27 సీజన్‌లో మూడు టెస్టులు, మూడు వన్డేల సిరీస్**

**వివాదం జరిగిన కేప్‌టౌన్‌లోని న్యూలాండ్స్ మైదానంలోనే చివరి టెస్ట్**

**ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో ఈ సిరీస్ కీలకం**

సెప్టెంబర్‌లో వన్డే సిరీస్, అక్టోబర్‌లో టెస్ట్ సిరీస్ ఆస్ట్రేలియా క్రికెట్‌లో పెను దుమారం రేపిన 2018 బాల్ ట్యాంపరింగ్ (శాండ్ పేపర్ తో రుద్ది బంతి రూపు మార్చిన) వివాదం తర్వాత... ఆ జట్టు తొలిసారి దక్షిణాఫ్రికా గడ్డపై టెస్ట్ సిరీస్ ఆడేందుకు రంగం సిద్ధమైంది. 202627 సీజన్‌లో భాగంగా ఆస్ట్రేలియా జట్టు దక్షిణాఫ్రికాలో పర్యటించనుంది. ఈ పర్యటనలో భాగంగా చివరి టెస్టుకు, ఆ వివాదానికి కేంద్ర బిందువైన కేప్‌టౌన్‌లోని న్యూలాండ్స్ మైదానమే వేదిక కావడం ఈ సిరీస్‌పై ఆసక్తిని రెట్టింపు చేస్తోంది. ఎనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆస్ట్రేలియా జట్టు దక్షిణాఫ్రికాలో టెస్టులు ఆడనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

క్రికెట్ సౌతాఫ్రికా (సీఎస్ఏ) తాజాగా 202627 సీజన్‌కు సంబంధించిన అంతర్జాతీయ షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం, ఈ పర్యటన సెప్టెంబర్‌లో మూడు వన్డేల సిరీస్‌తో ప్రారంభమవుతుంది. డర్బన్, జోహన్నెస్‌బర్గ్, పోచెఫ్‌స్ట్రూమ్‌లలో వన్డే మ్యాచ్‌లు జరుగుతాయి. ఆ తర్వాత అక్టోబర్‌లో మూడు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఉంటుంది. టెస్టులకు ముందు పోచెఫ్‌స్ట్రూమ్‌లో ఒక వార్మప్ మ్యాచ్ కూడా ఆడతారు.

ఎనిమిదేళ్ల క్రితం, 2018లో దక్షిణాఫ్రికా పర్యటన సందర్భంగా కేప్‌టౌన్ టెస్టులో ఆస్ట్రేలియా ఆటగాళ్లు బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడటం ప్రపంచ క్రికెట్‌ను కుదిపేసింది. ఈ ఘటనలో అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్‌పై ఏడాది పాటు నిషేధం పడగా, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్‌పై 9 నెలల నిషేధం విధించారు. ఆ వివాదం తర్వాత ఆస్ట్రేలియా జట్టు పరిమిత ఓవర్ల మ్యాచ్‌ల కోసం దక్షిణాఫ్రికాకు వెళ్లినా, పూర్తిస్థాయి టెస్ట్ సిరీస్ ఆడటం ఇదే మొదటిసారి. ప్రస్తుత కెప్టెన్ పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్ వంటి ఆటగాళ్లు అప్పటి జట్టులో సభ్యులు కావడం విశేషం. అయితే, ఈ వివాదంలో కీలక పాత్ర పోషించిన వార్నర్ ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకగా, అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్ కెరీర్ లోనే ఇది మాయని మచ్చలా మిగిలిపోయింది. ఆ సిరీస్ లో ఆడిన టిమ్ పైన్, ఉస్మాన్ ఖవాజా రిటైర్మెంట్ ప్రకటించారు.

గత రెండు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) టైటిళ్లను గెలుచుకున్న ఈ రెండు జట్ల మధ్య పోరు హోరాహోరీగా సాగే అవకాశం ఉంది. ఆర్థిక ఒత్తిళ్లు, ఎస్ఏ20 లీగ్ కారణంగా గత కొన్ని సీజన్లలో టెస్టుల సంఖ్యను తగ్గించుకున్న దక్షిణాఫ్రికాకు, ఈ సిరీస్ టెస్ట్ క్రికెట్‌కు పునరుజ్జీవం పోసినట్లు అవుతుంది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పట్టికలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, దక్షిణాఫ్రికా, భారత్ వంటి కఠినమైన పర్యటనలు ఆ జట్టుకు సవాల్ విసరనున్నాయి. ఈ పర్యటనకు ముందు ఆస్ట్రేలియా జట్టు బంగ్లాదేశ్‌తో సిరీస్ ఆడనుండగా, దక్షిణాఫ్రికాకు వెళ్లే ముందు పొరుగున ఉన్న జింబాబ్వేలో కూడా పర్యటించే అవకాశం ఉంది.

**సిరీస్ షెడ్యూల్:**

**వన్డే సిరీస్:**

**మొదటి వన్డే: సెప్టెంబర్ 24, డర్బన్**

**రెండో వన్డే: సెప్టెంబర్ 27, జోహన్నెస్‌బర్గ్**

**మూడో వన్డే: సెప్టెంబర్ 30, పోచెఫ్‌స్ట్రూమ్ (డే/నైట్)**

**టెస్ట్ సిరీస్:**

**మొదటి టెస్ట్: అక్టోబర్ 9-13, డర్బన్**

**రెండో టెస్ట్: అక్టోబర్ 18-22, గెబెర్హా**

**మూడో టెస్ట్: అక్టోబర్ 27-31, కేప్‌టౌన్**

## సూపర్ 8 మ్యాచ్.. జింబాబ్వేపై వెస్టిండీస్ ఘన విజయం



టీ20 ప్రపంచ కప్ 2026లో జింబాబ్వేతో జరిగిన సూపర్8 మ్యాచ్‌లో వెస్టిండీస్ 107 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది. కొండంత లక్ష్యఛేదనలో జింబాబ్వే 17.4 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌటైంది. ఎనిమిదో స్థానంలో వచ్చిన బ్రాడ్ ఇవాన్స్ (43; 21 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) మాత్రమే పోరాడాడు. డియోన్ మైయర్స్ (28), సికిందర్ రజా (27), మరుమాని (14), టోనీ మున్యాంగా (14) పరుగులు చేశారు. ఒక దశలో జింబాబ్వే 103 పరుగులకే 9 వికెట్లు కోల్పోగా ఇవాన్స్ మెరుపులు మెరిపించడంతో స్కోరు 140 దాటింది. కరేబియన్ జట్టు బౌలర్లలో గుడాకేష్ మోటి 4, అకిల్ హోస్సేన్ 3, మాథ్యూ ఫోర్డ్ 2, జేసన్ హోల్డర్ ఒక వికెట్ పడగొట్టారు.

విండీస్ బ్యాటర్లలో షిమ్రోన్ హెట్‌మయెర్ (85; 34 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్స్‌లు), రోవ్‌మన్ పావెల్ (59; 35 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలు సాధించారు. ఆఖర్లో షెర్ఫానె రూథర్‌ఫోర్డ్ (31; 13 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), రొమారియో షెఫర్డ్ (21: 10 బంతుల్లో 3 సిక్స్‌లు), జాసన్ హోల్డర్ (13; 4 బంతుల్లో 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. ఓపెనర్లు బ్రాండన్ కింగ్ (9), షై హోప్ (14) విఫలమయ్యారు. జింబాబ్వే బౌలర్లలో ఎన్‌గరవా 2, ముజరబాని 2, బ్రాడ్ ఇవాన్స్, క్రెమెర్ చెరో వికెట్ తీశారు.

## చరిత్ర సృష్టించిన హెట్‌మైర్.. ఫాస్టెస్ట్ ఫిఫ్టీ

టీ20 ప్రపంచకప్-2026లో వాంఖడే స్టేడియం వేదికగా జింబాబ్వేతో జరుగుతున్న సూపర్-8 మ్యాచ్‌లో వెస్టిండీస్ పవర్ హిట్టర్ షిమ్రాన్ హెట్‌మైర్ విధ్వంసం సృష్టించాడు. విండీస్ ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో క్రీజులోకి వచ్చిన హెట్‌మైర్ తన ఎదుర్కొన్న తొలి బంతి నుంచే బౌండరీలు బాదడం మొదలు పెట్టాడు.

జింబాబ్వే బౌలర్లను ఉతికారేశాడు. ముఖ్యంగా కెప్టెన్ సికిందర్ రజాకు అయితే చుక్కలు చూపించాడు. 8వ ఓవర్ వేసిన రజా బౌలింగ్‌లో హెట్‌మైర్ ఏకంగా మూడు సిక్స్‌లతో 20 పరుగులు పిండుకున్నాడు. ఈ క్రమంలో హెట్‌మైర్ కేవలం 19 బంతుల్లోనే తన హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. తద్వారా హెట్‌మైర్ టీ20 ప్రపంచకప్‌లో అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ చేసిన విండీస్ ఆటగాడిగా తన రికార్డును తానే మళ్లీ తిరగరాశాడు.

వెస్టిండీస్ తరఫున అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ చేసిన ఆటగాడిగా తన రికార్డును తానే మళ్లీ తిరగరాశాడు. ఇదే టోర్నీలోహెట్‌మైర్ స్కాట్లాండ్‌పై 22 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. ఇప్పుడు కేవలం 19 బంతుల్లోనే అర్ధం శతకం బాదేశాడు.

ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో కేవలం 34 బంతులు మాత్రమే ఎదుర్కొన్న హెట్‌మైర్.. 7 ఫోర్లు, 7 సిక్స్‌లతో 85 పరుగులు చేశాడు. అయితే ఈ మ్యాచ్‌లో రెండు సార్లు హెట్‌మైర్ ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. రెండు సులువైన క్యాచ్‌లను జింబాబ్వే ఫీల్డర్లు జారవిడిచారు. ఇందుకు జింబాబ్వే భారీ మూల్యం చెల్లించుకోంది.

# బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సంచలన నిర్ణయం!



**బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) సంచలన నిర్ణయం తీసుకుంది. మాజీ క్రికెటర్ మొన్‌జురుల్ ఇస్లాంపై వేటు వేసింది. తమ పరిధిలోకి వచ్చే క్రికెట్ సంబంధిత వ్యవహారాలన్నింటికీ దూరంగా ఉండాలని అతడిని ఆదేశించింది. ఈ మేరకు అతడిపై నిషేధం విధిస్తూ ప్రకటన జారీ చేసింది. అసలేం జరిగిందంటే.. ప్రపంచకప్-2022 సందర్భంగా మొన్‌జురుల్ ఇస్లాం తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ బంగ్లా మహిళా క్రికెట్ జట్టు నాటి కెప్టెన్ జహనారా ఆలం సంచలన ఆరోపణలు చేసింది.**

**స్వతంత్ర విచారణ కమిటీ**

ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన బోర్డు.. ఆదివారం తమ తుది నిర్ణయాన్ని వెల్లడించింది. షేర్‌ఏ బంగ్లా నేషనల్ క్రికెట్ స్టేడియంలో సమావేశమైన బోర్డు సభ్యులు.. స్వతంత్ర విచారణ కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించారు. జహనారా ఆరోపించినట్లుగానే మొన్‌జురెల్‌కు సంబంధించి తమకు ప్రాథమిక ఆధారాలు లభించినట్లు కమిటీ పేర్కొంది. ఈ నేపథ్యంలో.. "బీసీబీ నియమించిన స్వతంత్ర విచారణ కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు... మహిళా జట్టు కెప్టెన్ జహనార ఆలం ఆరోపణలు నిజమేనని తేలాయి.

**నిషేధం విధిస్తున్నాం**

ఈ క్రమంలో మొన్‌జురుల్ ఇస్లాంపై నిషేధం విధిస్తున్నాం. బీసీబీ పరిధిలోని క్రికెట్ సంబంధిత వ్యవహారాలతో ఇకపై అతడికి ఎలాంటి సంబంధాలు ఉండవు. కమిటీ చేసిన సిఫారసులను బీసీబీ సమీక్షిస్తుంది. ఈ విషయంలో అదనపు చర్యలకు సంబంధించి త్వరలోనే నిర్ణయం వెల్లడిస్తాం'' అని బీసీబీ తమ ప్రకటనలో పేర్కొంది. కాగా బంగ్లాదేశ్ మహిళల జట్టు సెలక్టర్, మేనేజర్‌గా మొన్‌జురుల్ వ్యవహరించాడు. గతేడాది జూన్ 30న అతడి పదవీకాలం ముగిసింది. ఇదిలా ఉంటే.. మహిళా జట్టు సెలక్షన్ ప్యానెల్ చైర్మన్ ఘాజి అష్రఫ్ హొసేన్ పదవీకాలాన్ని నెల రోజుల పాటు పొడిగిస్తున్నట్లు బీసీబీ ఈ సందర్భంగా వెల్లడించింది. ఘాజి స్థానాన్ని త్వరలోనే భర్తీ చేస్తామని.. అందుకోసం కాస్త సమయం పడుతుంది కాబట్టే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

**చారిత్రాత్మక ముందుడుగు**

**బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చారిత్రాత్మక ముందడుగు వేసింది. మహిళల క్రికెట్‌ను ప్రోత్సహించే క్రమంలో వుమెన్ బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (WBPL) నిర్వహణకు పచ్చజెండా ఊపింది. తొలి ఎడిషన్‌కు ఏప్రిల్ 4-14 వరకు షెడ్యూల్ ఫిక్స్ చేయగా.. బోర్డు ఇందుకు ఆమోదముద్ర వేసింది. ఢాకా, ఛట్టోగ్రామ్ వేదికగా ఈ మ్యాచ్‌లు జరుగనున్నాయి.**